విజయవాడ
బుధవారం,
18 మార్చి 2026
సంపుటి: 12, సంచిక: 77
వెల :6/- పేజీలు : 12

# విశాలం

నిఖార్సైన జర్నలిజం



-2లో

## పాక్ మారణహోమం

కాబూల్ ఆసుపత్రిపై భీకర దాడులు

Published From Vijayawada, Visakhpatnam, Tirupati

### ఏపీకి అదనంగా

# 24 వేల టన్నుల గ్యాస్

## ప్రజలకు ఇబ్బందుల్లేకుండా గ్యాస్ పంపిణీకి చంద్రబాబు ఆదేశం

- రాష్ట్రంలో 15 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- పైప్డ్ గ్యాస్ నెట్‌వర్క్ పెంచేందుకు కార్యాచరణ
- గ్యాస్ సరఫరాపై రెండోరోజూ సీఎం సమీక్ష

ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 15 రోజులకు సరిపడా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ ఉంటే.. అదనంగా మరో 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ విశాఖలో అందు బాటులోకి వచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరా, సిలెండర్ల పంపిణీ, పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ సహా వివిధ అంశాలపై సచివాల యంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఏపీలో ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేవని సీఎం స్పష్టం చేశారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలెండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా చూడాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు.



**అమరావతి, మార్చి 17**

గ్యాస్ కంపెనీలు స్వల్ప కాలికంగా ఉత్పత్తి పెంచటంతో పాటు పంపిణీ కూడా మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి గ్యాస్ సిలెండర్ల డెలివరీ సమయాన్ని 1.5 రోజులకు కుదించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్ల, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ ల స్టాక్స్ లభ్యతను కూడా తెలుసుకోవాలని సూచించారు. ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు, నెట్వర్క్ పెంపుపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ మరింతగా విస్తరించే అంశంపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం

- మిగతా 2వ పేజీలో

## దివ్యాంగులకు ప్రభుత్వం మరో కానుక

నేడు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రమంతటా దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ



## యూఏఈపై దాడులను ఖండించిన మోదీ

సురక్షిత నౌకాయానానికి అంగీకారం

యూఏఈ అధ్యక్షుడికి మోదీ ఫోన్

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై (యూఏఈ) దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండిం చారు. త్వరితగతిన శాంతిని నెలకొల్ప డానికి, పశ్చిమాసియా భద్రత, స్థిరత్వానికి ఆ దేశంతో కలిసి పని చేసేందుకు అంగీకరించారు.

-2లో



## ఇరాన్‌కు ఎదురుదెబ్బ

ఇజ్రాయెల్ దాడుల్లో అగ్రశ్రేణి అధికారులు మృతి

ఖమేనీ కుడిభుజం అలీ లారిజానీ, జనరల్ సులేమానీ హతం

- ఇరాన్ నాయకత్వం వెన్నెముక విరిచేశాం

-6లో





## తమిళనాట.. ఒంటరి పోరుకు విజయ్ సిద్ధం

ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోని టీవీకే

యువత, మహిళల ఓట్లే లక్ష్యంగా ముందుకు



తమిళనాడులో తమిళగ వెట్రి కళగం(టీవీకే) పేరుతో రాజకీయ పార్టీ పెట్టిన సినీనటుడు విజయ్ ఎన్నికల్లో గెలుపు ధీమాతో ముందు కెళు న్నారు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా బరిలోకి దిగుతున్నారు. బలమైన డీఎంకే, అన్నాడీఎంకే కూటములతో పోరుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో అవినీ తిరహిత పాలన అందిస్తామని ప్రకటిస్తున్నారు.

-2లో

## 161 మందికి కళారత్న, ఉగాది పురస్కారాలు

సాహిత్యం, సంగీతం వంటి విభిన్న రంగాల నుంచి ఎంపిక

విజయవాడలో రేపు ప్రదానం చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, మార్చి 17**

సాహిత్యం, సంగీతం, నృత్యం, సామాజిక సేవ వంటి విభిన్న రంగాలలో చేసిన సేవలను గుర్తించి 161 మందిని కళారత్న (హంస), ఉగాది పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసింది. కళారత్నకు 38 మంది, ఉగాది పురస్కారాలకు 123 మంది ఎంపికయ్యారు. ఈ వివరాలు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మంగళవారం వెల్లడించారు. ఉగాది సందర్భంగా గురువారం విజయవాడలోని అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే సభలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాలు అందించనున్నారు. కళారత్న (హంస) పురస్కార గ్రహీతలకు రూ.50 వేల నగదు, హంస ప్రతిమ, సర్టిఫికెట్,

- మిగతా 6వ పేజీలో







## ఇండియాపోస్ట్ 24 గంటల డెలివరీ సేవలు ప్రారంభం

హైదరాబాద్ సహా ఆరు ప్రధాన నగరాల్లో అందుబాటులోకి

-2లో



-2లో

## ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి

త్వరలో ఉండవల్లి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్

ఏపీఈడీబీ కార్యాలయం ప్రారంభోత్సవంలో లోకేశ్

రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ఏకైక లక్ష్యం కావాలని, పెట్టుబడులు కార్యరూపం దాల్చేందుకు కృషి చేయాలని అధికారులకు లోకేశ్ సూచించారు.

## చంద్రబాబు హామీలన్నీ 'మోసాలుగా తేలాయ్'

ఒంగోలు నియోజకవర్గ పార్టీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో భేటీలో వైఎస్ జగన్

- జగన్ ఇచ్చిన పథకాలన్నీ బాబు రద్దు చేశాడు.. కూటమి సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- కోవిడ్ లాంటి పరిస్థితుల్లోనూ జగన్ ప్రజలకు సంక్షేమ పథకాలను ఇచ్చాడు.. ప్రతి ఇంటికీ మేలు చేశాడు

-6లో



# ఏపీకి అదనంగా 24 వేల టన్నుల గ్యాస్

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్, పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్ జీని ఏపీకి కేటాయిం చేలా చేసుకుని 2 సీజన్లలో పైప్ ద్వారా కొండపల్లి వరకూ తీసుకు రాగలిగామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఎనర్జీ ట్రాన్సిషన్ జరిగేలా వ్యయం తక్కువ అయ్యే ఇంధనాన్ని వినియోగదారులకు అందించాల్సి ఉందని స్పష్టం చేశారు. పైప్డ్ గ్యాస్ సరఫరాకు సంబంధించి తక్షణం చేయగలమన్న అంశంపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచించారు. ప్రస్తుతం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ లు సహజ వాయువును సరఫరా చేస్తున్నాయని అధికారులు వివరించారు. 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా ఈ సరఫరా జరుగుతోందని తెలిపారు. 1.68 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఇచ్చేలా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం సీఎన్జీ, పీఎన్జీ నెట్వర్క్ ను మరింత విస్తృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అమరావతితో పాటు పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ పెంచుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాల ను పెంచేందుకు వీలుగా పెట్రోలియం కంపెనీలు కూడా సహకరించేలా కేంద్రంతో సంప్రదింపులు చేయా లన్నారు.

### త్వరలో ఏపీ వన్ యాప్ ద్వారా సేవలు

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులను సెన్సిటైజ్ చేయాలని సీఎం సూచించారు. సిటిజన్ సేఫ్టీ అవేర్‌నెస్ కింద వారికి సంక్షిప్త సమాచారాన్ని పంపించాలని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు లింక్ ను యాప్ ద్వారా లేదా వాట్సప్ గవర్నెన్సు ద్వారా వినియోగదారులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రూపొందిస్తున్న ఏపీ వన్ యాప్ ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. డేటా లేక్, అవేర్ ను ప్రభుత్వ శాఖలు ఏమేరకు వినియోగించుకున్నది గుర్తించాలని సీఎం సూచించారు. వేసవిలో అవేర్ ద్వారా సమాచారం తీసుకుని తాగునీరు, హీట్ వేవ్స్, పశుగ్రాసం సహా వివిధ అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేలా ప్రజల్లో విస్తృతమైన మార్పు వచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. గ్రామాల్లో వ్యర్థాలను తొలగించి చెత్తను వర్గీకరించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణాల నుంచి వచ్చే వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయితీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, సురేశ్ కుమార్, దేవాదాయశాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, వివిధ పెట్రోలియం కంపెనీలు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులు హాజరయ్యారు.

# పాక్ మారణహోమం

- కాబూల్ ఆసుపత్రిపై భీకర దాడులు
- 400 మంది మృతి.. మృతులసంఖ్య పెరిగే అవకాశం

**కాబూల్, మార్చి 17:**

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులు తీవ్ర విషాధాన్ని మిగిల్చాయి. సోమవా రంరాత్రి మాదకద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తి పొందేందుకు చికిత్స అందిస్తున్న 'ఒమిడ్ అడిక్షన్ ట్రీట్మెంట్ హాస్పిటల్' లక్ష్యంగా పాక్ యుద్ధ విమానాలు క్షిపణులతో బీభత్సంగా దాడులు చేశాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు 400 మంది మృత్యువు పాలు కాగా మరో 250 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. పాక్ జరిపిన వైమానిక దాడుల్లో దాదాపు రెండువేల పడకల సామర్థ్యం కలిగిన ఈ భారీ ఆసుపత్రి భవనం కుప్పకూలింది. వందలాది మంది రోగులు నిద్రలో ఉండటంతో వందల సంఖ్యలో మృతుల్లో ఎక్కువ మంది పేద రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నట్లు సమాచారం. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు రెస్క్యూ టీమ్స్ శ్రమిస్తున్నాయని అధికారులు తెలిపారు. అయితే, పాకిస్తాన్ ఈ ఆరోపణను 'అసత్యం, తప్పుదోవ పట్టించేది' అని ఖండించింది. సోమవారం రాత్రి తమ దాడులు కచ్చితమైనవని, కేవలం సైనిక స్థావరాలు, ఉగ్రవాద మద్దతు మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొంది. పౌర ఆసుపత్రిపై దాడి చేయడం అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని, ఇది మానవత్వానికి వ్యతిరేకమైన నేరమని తాలిబన్ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ మండిపడ్డారు. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. బాధితుల కుటుంబాలకు ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయక మిషన్ (యునామా) సంతాపం తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల వల్ల పౌరులు తీవ్రంగా నష్టపోతున్నారని ఐక్యరాజ్యసమితి మిషన్ పేర్కొంది. ఈ దాడులపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఆందోళన వ్యక్తం చేశారు. వివాదాలను పరిష్కరించడానికి చర్చలు, సంప్రదింపులు మాత్రమే సమర్థవంతమైన మార్గమని ఆయన అన్నారు.

కాబూల్‌లోని ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 400 మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది సైనిక చర్య ముసుగులో జరిగిన మారణహోమం అని, పాకిస్థాన్ చర్య క్షమించరానిదని మండిపడింది. పాక్ చేపట్టిన ఈ దుశ్చర్య ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దారుణమైన దాడి అని, ఇది ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ప్రత్యక్ష ముప్పు అని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు శాంతి, కరుణకు ప్రతీకగా భావించే పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత హేయమైన చర్య అని భారత్ పేర్కొంది.

# ఎర్రచందనం పెట్టుబడి పేరుతో రూ.9.27 కోట్ల మోసం

## లక్నోలో కేసు నమోదు

**విజయవాడ, మార్చి 17 (భారత్ న్యూస్)**

ఎర్రచందనం సాగులో పెట్టుబడి పెట్టిస్తామని భారీ లాభాలు వస్తాయని నమ్మబలికి ఓ వ్యాపారిని రూ.9.27 కోట్లకు మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో గోమతి నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రాయబరేలీ రోడ్డులోని సౌత్ సిటీ ప్రాంతానికి చెందిన వ్యాపారి హేమంత్ కుమార్ రాయ్ ఈ మోసానికి గురయ్యారు. గోమతి నగర్‌లోని తన కార్యాలయానికి తరచుగా వచ్చిన కర్నూలు జిల్లాకు చెందిన పలువురు వ్యక్తులు ఎర్రచందనం సాగు ప్రాజెక్ట్ పేరుతో ఆయనను మోసం చేసినట్లు తెలిసింది. 2022లో ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎర్రచందనం సాగు ప్రాజెక్ట్ ఉందని చెప్పి, అందులో పెట్టుబడి పెడితే కోట్లలో లాభాలు వస్తాయని నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన హేమంత్ కుమార్ రాయ్ 2023 జూన్ 14 నుంచి 2026 జనవరి వరకు విడతల వారీగా మొత్తం రూ.9.27 కోట్లను అందజేశారు. తర్వాత ప్రాజెక్ట్ స్థలాన్ని పరిశీలించడానికి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లినప్పుడు అక్కడ ఎక్కడా ఎర్రచందనం సాగు లేకపోవడం గమనించి తాను మోసపోయినట్లు గుర్తించారు. ఈ విషయంపై నిందితులను ప్రశ్నించగా వారు తనపై దాడి చేసినట్లు కూడా బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనపై కోర్టును ఆశ్రయించగా, ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తు అనంతరం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మరో కానుక

- 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు పథకం వర్తింపు
- 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' విస్తరణ
- వెంట వచ్చే సహాయకులకు ఛార్జీల్లో 50 శాతం రాయితీ
- 12.76 లక్షల మంది దివ్యాంగులు, సహాయకులకు లబ్ది
- ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.207 కోట్ల వ్యయం
- ప్రతీ నియోజకవర్గంలో

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉగాది కానుక ప్రకటించింది. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలోని దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి బుధవారం అమరావతిలో శ్రీకారం చుడతారు. అలాగే ప్రతీ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దివ్యాంగ శక్తిని ప్రారంభించనున్నాను. ఈ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని మరోసారి నిరూపించింది. గతేడాది డిసెంబర్ 3న నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈరోజు ఆ మాట నిలబెట్టుకున్నారు.

### 'స్త్రీశక్తి' బస్సులే 'దివ్యాంగ శక్తి'కి వర్తింపు

ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వాళ్లకు, 100 శాతం మూగ, చెవిటి వారికి, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి 50 శాతం రాయితీ లభిస్తోంది. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్నవారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోంది. అయితే 'దివ్యాంగ శక్తి' పథకం కింద దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. అంటే దివ్యాంగులు ఇకపై సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఒక్క రూపాయి కూడా ఛార్జీ లేకుండా రాష్ట్రమంతా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అంతేకాదు, వారితో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

### 4 నుంచి 21 వర్గాలకు పథకం విస్తరణ

ఇప్పటివరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేది. ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ఈ సౌకర్యాన్ని విస్తరించింది. శారీరక-మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుంది. ప్రస్తుతం 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ది చేకూరుతుండగా... పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది. వీరిలో పురుషులు 6.86 లక్షల మంది ఉన్నారు. అలాగే ఇప్పటివరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా... ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే మొత్తం లబ్దిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరిగనుంది.

### 7,264 బస్సుల్లో ఉచిత ప్రయాణం

ఈరోజు నుంచి స్త్రీ శక్తి పథకం వర్తించే 7,264 బస్సుల్లో దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీలో సుమారు 73 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింప చేశారు. ఇప్పటికే దివ్యాంగులు, వారి సహాయకులకు 3 సంవత్సరాల కాలానికి ఇచ్చిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసేందుకు ఉపయోగపడతాయి. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా పొందవచ్చు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్లలోని 134 కౌంటర్లలో దివ్యాంగులకు సేవలు అందుతాయి. ఈ యాప్స్‌ను సదరం యాప్‌తో అనుసంధానించినందున ఫిజికల్ సర్టిఫికేట్ చూపించాల్సిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌తో ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారు.

### ఏడాదికి రూ.207 కోట్ల వ్యయం

ఈ పథక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రూ.207 కోట్లు సబ్సిడీ అందిస్తుంది. దివ్యాంగుల్లో సామాజిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ఇది. స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక వెసులు బాటు, సాధికారత కల్పించింది. గతేడాది ఆగస్ట్ 15న స్త్రీశక్తి పథకం ప్రారంభిస్తే... ఈ మార్చి 15 నాటికి... అంటే 7 నెలల్లో 52 కోట్ల ప్రయాణాలు మహిళలు ఉచితంగా చేశారు. దీనికి ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,826 కోట్లు రాయితీ భరించింది. మహిళల ఉచిత ప్రయాణాలకు రోజుకు ప్రభుత్వం రూ.8.57 కోట్లు ఖర్చు పెడుతోంది. సగటున 24.38 లక్షల మంది స్త్రీ శక్తిని రోజూ వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే ప్రతీ వందమందిలో 37 మంది మగవాళ్లు ఉంటే, 63 మంది మహిళలే ఉంటున్నారు. ఇది స్త్రీ శక్తి పథకం ఎంతలా సూపర్ హిట్ అయ్యిందో చెబుతోంది. దివ్యాంగ శక్తి కూడా ఇంతే ఆదరణ పొందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దివ్యాంగులకు సమాజంలో సరైన స్థానం, గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్న మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రవేశ పెట్టడం ద్వారా మరోసారి నిలబెట్టుకున్నారు.

# యూఏఈపై దాడులను ఖండించిన మోదీ

**ఢిల్లీ, మార్చి 17**



మంగళవారం యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. హర్మూజ్ జల సంధి మీదుగా సురక్షిత, స్వేచ్ఛాయుత నౌకాయానానికి కలిసి పనిచేయాలని ఇద్దరు నేతలు అంగీకరించాయి. పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించారు. 'నా సోదరుడు నహ్యాన్‌తో మాట్లాడా. ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపా. పశ్చిమాసియా పరిస్థితిపై ఆయనతో చర్చించా. యూఏఈపై దాడులను అన్ని రకాల దాడులను భారత్ ఖండిస్తుందని చెప్పా. వాటివల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. మౌలిక వసతులు దెబ్బతిన్నాయి' అని ఎక్స్‌లో మోదీ పేర్కొన్నారు.

### యుద్ధ విధ్వంస శాటిలైట్ చిత్రాల విడుదల

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధానికి సంబంధించిన విధ్వంస శాటిలైట్ చిత్రాలు విడుదలవుతున్నాయి. ఇప్పటిదాకా గల్ఫ్ దేశాల్లో జరిగిన విధ్వంసానికి సంబంధించిన వివరాలు పెద్దగా వెల్లడికాలేదు. తాజాగా విడుదల చేసిన చిత్రాల్లో విధ్వంస ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ చిత్రాల్లో.. ఇరాన్ బందర్ అబ్బాస్ పోర్టులోని నౌకలు మంటల్లో కాలిపోయాయి. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరమైన 5వ ఫ్లీట్‌లో భారీ విధ్వంసం జరిగింది. అబుధాబీలోని ఫ్రాన్స్ నౌకాదళ స్థావరం దెబ్బతింది. అందులోని రెండు హ్యాంగర్లు ధ్వంసమయ్యాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా మంటలు చెలరేగాయి. ఒమన్‌లోని సలాలా పోర్టులో మంటలు చెలరేగిన దృశ్యాలూ శాటిలైట్ చిత్రాల్లో కనిపించాయి.

# తమిళనాట.. ఒంటరి పోరుకు విజయ్ సిద్ధం

**చెన్నై, మార్చి 17**

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ప్రభావం గట్టిగా ఉండబోతుందని, ద్రావిడ పార్టీల ఓటు బ్యాంకును కొల్లగొట్టే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకుల అంచనా. తమిళనాట ఇప్పటి వరకు ఉన్న పార్టీలు సామాజిక వర్గాలను నమ్ముకొని పావులు కదిపాయి. విజయ్ అవేవీ పట్టించుకోకుండా యువత, మహిళల ఓట్లపై దృష్టిపెట్టారు. ఆయన ఉపన్యాసాలకు, హామీలకూ 25 ఏళ్లలోపు వారు ఎక్కువ ఆకర్షితులవడం కలిసొచ్చే విషయం. మహిళలకూ ఏకంగా 13 హామీలిచ్చారు. ముఖ్యంగా ఏడాదికి 6 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు, నెలవారీ సాయంగా రూ.2,500, అన్ని ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పిల్లల్ని చదివిస్తే ఏటా రూ.15 వేలు, యువతుల పెళ్లికి 8 గ్రాముల బంగారం, చీర ఇచ్చే పథకాలను తీసుకొస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో డీఎంకే అవినీతి మితిమీరిందని విజయ్ పలుమార్లు విమర్శించారు. రెండు ప్రధాన కూటములకు ప్రత్యామ్నాయం తానేనని ప్రకటించారు. తమిళనాడులో ద్రావిడ విధానాలకే ఓటర్లు మొగ్గుచూపుతారని గుర్తించి పెరియార్, అంబేద్కర్, కామరాజర్ భావజాలాలతో తన పార్టీ నడుస్తోందని ప్రతి సభలోనూ చెబుతున్నారు. ద్వి భాషా విధానానికే మొగ్గుచూపారు. లౌకికవాద సిద్ధాంతాల్ని కాపాడతానని హామీ ఇచ్చారు. విజయ్‌కి ప్రత్యక్ష రాజకీయ అనుభవం లేకపోవచ్చు కానీ. విజయ్ మక్కల్ ఇయక్కం పేరుతో ఫ్యాన్ క్లబ్‌ల ఏర్పాటు.. స్థానిక ఎన్నికల్లో పోటీకి నిలిచిన అనుభవం కేడర్‌కు ఉంది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎంతోమంది అభిమానుల్ని కూడగట్టుకున్నారు. ఆ అండతోనే ఇప్పటికే 70 వేల మంది బూత్ ఏజెంట్లను నియమించారు. వీరితో 1.5 కోట్ల సభ్యత్వ నమోదు చేయించారు. ఈ ఉత్సాహమే గతేడాది నిర్వహించిన సభలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చేలా చేసింది.

# ఇండియాపోస్ట్ 24 గంటల డెలివరీ సేవలు ప్రారంభం

**ఢిల్లీ, మార్చి 17**

డాక్యుమెంట్లు, పార్శిళ్లను తక్కువ వ్యవధిలోనే గమ్యస్థానానికి చేర్చే కొత్త సేవలను తపాలా శాఖ ప్రారంభించింది. మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు సంయుక్తంగా దీనికి సంబంధించిన మూడు సేవలకు శ్రీకారం చుట్టారు. వీటిలో మొదటిది... 24 గంటల్లో గమ్యం చేర్చే 'స్పీడ్‌పోస్టు'(డాక్యుమెంట్స్). రెండోది...24 గంటల 'స్పీడ్‌పోస్ట్ పార్శిల్'. మూడోది...'48 గంటల స్పీడ్‌పోస్ట్'. ఈ సేవలు ప్రధానంగా 5 కిలోలలోపు బరువున్న పార్శిళ్లు, డాక్యుమెంట్లకు వర్తిస్తుంది. తొలుత వీటిని ప్రధాన నగరాలైన ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి నగరాల్లో అందుబాటులోకి తెస్తున్నట్లు సింధియా ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. దేశంలో లాజిస్టిక్స్ వ్యాపార విస్తృతి ప్రస్తుతం సుమారు రూ.90వేల కోట్లుగా ఉందని, వచ్చే ఆరేళ్లలో రూ.1.80 లక్షల కోట్లకు చేరనుందని పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. తపాలా శాఖకు ఇదో సువర్ణావకాశమని అభిప్రాయపడ్డారు.

# ఉద్యోగాల కల్పనే లక్ష్యం

**మంగళగిరి, మార్చి 17**

మంగళగిరి బైపాస్ రోడ్డులోని మయూరి టెక్‌పార్కు ఐదో అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించాక కార్యాలయం మొత్తాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఈడీబీ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించిందని చెప్పారు. దేశానికి రూ.వంద పెట్టుబడులు వస్తే అందులో 25 రూపాయలు ఏపీకే వచ్చాయని తెలిపారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు ఏపీని ఎంచుకున్నాయని, ఇప్పుడు మనం మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. రిలయన్స్ సీజీబీ ప్రాజెక్టుతో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయన్నారు. ఎన్ని ఉద్యోగాలు కల్పించామన్నదే ముఖ్యమన్నారు. ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలని స్పష్టం చేశారు. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా ప్రధానమని చెప్పారు. ఉద్యోగులు తమకు కేటాయించిన క్లస్టర్లలో నిపుణులుగా మారాలన్నారు. ఒప్పందం కుదుర్చుకున్న ఏ ప్రాజెక్టూ ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది ఉన్నతంగా ఆలోచించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23న రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నామని, ఇంతటితో తృప్తి పడకుండా ఐదు స్టీల్ సిటీలు ఎందుకు నిర్మించకూడదు? అనే ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఏప్రిల్ చివరి నాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ చైర్మన్ ఎం.అభిషిక్త్ కిశోర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, సౌరభ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.



## ఏఐ ఆధారిత లైఫ్ సైన్సెస్ పరిశోధనకు మహీంద్రా యూనివర్సిటీ

### బోల్ట్జమన్ ల్యాబ్స్ భాగస్వామ్యంపై

హైదరాబాద్, మార్చి 17

మహీంద్రా యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత బయోటెక్నాలజీ, ఔషధ ఆవిష్కరణ సంస్థ బోల్ట్జమన్ ల్యాబ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంపై మహీంద్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యంతో అకాడెమిక్ పరిశోధన, పరిశ్రమ నైపుణ్యాలను సమన్వయం చేసి విద్యార్థులు, పరిశోధకులకు అనుభవాత్మక అభ్యాస అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో సంయుక్త పరిశోధన కార్యక్రమాలు చేపట్టనున్నారు. మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. యాజులు మెదూరి మాట్లాడుతూ, ఈ ఒప్పందం అకాడెమిక్ కట్టుదిట్టతను వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో మేళవించే భవిష్యత్‌కు సిద్ధమైన పరిశోధన వాతావరణాన్ని నిర్మించాలన్న తమ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. బోల్ట్జమన్ ల్యాబ్స్‌తో భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, కంప్యూటేషనల్ లైఫ్ సైన్సెస్ వంటి ఆధునిక రంగాల్లో పని చేసే అవకాశాన్ని పొందుతారని తెలిపారు. సెంటర్ ఫర్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ డా. రాజిందర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం ద్వారా పరిశోధన సామర్థ్యాలు, అకాడెమిక్ ఆఫర్లు గణనీయంగా మెరుగుపడతాయని చెప్పారు. సంయుక్తంగా వర్క్‌షాప్‌లు, సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌లు, అకాడెమిక్ కార్యక్రమాలు నిర్వహించి సిద్ధాంతం--ప్రయోగం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించనున్నట్లు తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఏఐ ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతోందని, ముఖ్యంగా ఔషధ ఆవిష్కరణ, బయోమెడికల్ ఇన్నోవేషన్‌లో కంప్యూటేషనల్ సాధనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా పరిశోధన, అభ్యాసం, వాస్తవ ప్రపంచ ప్రభావాన్ని పెంపొందించే సహకార వాతావరణం ఏర్పడుతుందని వివరించారు.

## చిన్నారి ప్రాణం కోసం ఆపన్నహస్తం




విజయవాడ పశ్చిమ, మార్చి 17

అరుదైన నాడీమండల వ్యవస్థ వ్యాధితో బాధపడుతూ ప్రాణాలతో పోరాడుతున్న చిన్నారి రిషి కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం సమాజంలోని ప్రతి పౌరుడూ బాధ్యత తీసుకోవటం కోసం ముందుకురావాలని కె.బి.ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు అన్నారు. కెబిఎన్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్బ, వన్ ఎర్త్ వన్ లైఫ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'స్వచ్ఛంద విరాళాల సేకరణ' కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. శ్రీనివాసు మాట్లాడుతూ చిన్నారి ప్రాణం కోసం ఆపన్నహస్తం అందించేందుకు తమ కళాశాల విద్యార్థులు స్వచ్ఛంగా ముందుకు వచ్చారని, వీలైనంత సహాయాన్ని విద్యార్థులు చేస్తున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సుమారు రూ.18 కోట్లు ఖర్చయ్యే వైద్యం నిమిత్తం తమ సంస్థ పక్షాన సహాయం చేస్తున్నామన్నారు. కాలేజీ ఎన్.ఎస్.ఎస్ విభాగ విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలు స్వచ్ఛందంగా అందించిన విరాళాన్ని సేకరించి, రిషి కుమార్ తల్లిదండ్రులకు అందజేస్తావన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తొలిగా తనవంతు విరాళాన్ని ఇచ్చి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ శాంతిబాబు, డి.పవన్, గౌతమీదేవి, ఎన్. సాంబశివరావు, వన్ ఎర్త్ వన్ లైఫ్ ఫౌండర్ ఏలూరి లీలాకుమారి, సభ్యులు వీరవనిత, ఎం.కమలాకర్, రిషి కుమార్ తండ్రి ముని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## యువతతో జాతీయ సమైక్యతకు కొత్త దిశ

### అంతర రాష్ట్ర యువజన సమ్మేళనం విజయవంతంగా ముగింపు



గుంటూరు, మార్చి 17

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ భవన్‌లో నిర్వహించిన అంతర రాష్ట్ర యువజన మార్పిడి సమ్మేళనం (ద్వితీయ దశ) మంగళవారం ఘనంగా ముగిసింది. కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మై భారత్ గుంటూరు జిల్లా నిర్వహించిన ఈ ఐదు రోజుల సమ్మేళనం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమం ముగింపు సభలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర రావు మాట్లాడుతూ, దేశ ఐక్యత మరియు సమగ్రతను బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల యువత పరస్పరం కలుసుకుని సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను పంచుకోవడం ద్వారా దేశంలో ఐక్యత భావన మరింత బలపడుతుందని అన్నారు. త్రిపుర రాష్ట్రం నుండి వచ్చిన 37 మంది యువతి–యువకులు ఈ సమ్మేళనంలో చురుకుగా పాల్గొని, ఐదు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, క్షేత్రస్థాయి సందర్శనలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలలో పాల్గొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని వారు తెలిపారు. మై భారత్ గుంటూరు జిల్లా ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ, ఈ సమ్మేళనం ద్వారా రాష్ట్రాల మధ్య సాంస్కృతిక అవగాహన, స్నేహభావం పెరిగిందని, యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి తదితరులు పాల్గొన్నారు. త్రిపుర నుంచి హాజరైన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ అంద్దజేయడం జరిగింది.

### మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ పదవులు కల్పించిన

# వైసీపీ అధినేత జగన్ కు ధన్యవాదాలు

### డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



విజయవాడ, మార్చి 17

తనకు ఐదు సంవత్సరాలు డిప్యూటీ మేయర్ పదవి కల్పించిన వైసీపీ అధినేత వైయస్ జగన్ కు డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను ఇవ్వడం సంతోషకరమని చెప్పారు.. కార్పొరేషన్ లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పదవులు ఇచ్చిన జగన్ కు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్లో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్ గా సీటు ఇచ్చి గెలిపించి డిప్యూటీ మేయర్ పదవిలో ఉండేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించిన వైసిపి అధినేత జగన్, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు. తన తండ్రి ఆళ్ల చల్లారావుకి దేవినేని నెహ్రూ రాజకీయ ఎదుగుదలను ఇస్తే తనకు అవినాష్ అండగా ఉన్నారని గుర్తు చేసుకున్నారు. కార్పొరేటర్ గా 15వ డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో పాటు డిప్యూటీ మేయర్ గా నగరాభివృద్ధి మరియు కృష్ణలంక ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని వైసీపీ హయాంలో పూర్తి చేశామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత అవినాష్ ది అని నేడు కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల పాలనలో చేసిందేమీ లేదన్నారు. తమ సొంత డివిజన్ అయిన 15వ డివిజన్లో 32 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. పనులు చేసేందుకు సహకరించిన మున్సిపల్ కమిషనర్ లు మరియు ఉన్నతాధికారులు సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు.. డివిజన్ ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం అన్ని పనులు పూర్తి చేశామన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజ్ పనులు, విద్యుత్ లైట్లు, మరెన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. మేము చేసిన పనులకు కూటమి నేతలు కొబ్బరికాయలు కొట్టుకోవడం తప్ప వారు చేసిన నిజమైన అభివృద్ధి ఏమీ లేదన్నారు. మేము చేసిన అభివృద్ధి చర్చించేందుకు సిద్ధమని సవాల్ చేసిన కూటమి నేతలు ముందుకు రావడం లేదన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దగ్గరకు రావచ్చని నాకు అన్ని విధాల తోడుగా ఉన్న డివిజన్ ప్రజలందరికీ మరొక్కసారి ధన్యవాదాలు చెప్పారు.

# జీజీహెచ్‌లో యూత్ టైం బ్యాంక్

### వినూత్న కార్యక్రమాల ద్వారా సేవాభావం

### సేవలను ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మార్చి 17

జిల్లా యువజన సర్వీసులు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూత్ టైం బ్యాంకు సేవలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం న్యూ జీజీహెచ్‌లో యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వాసవ్య మహిళా మండలి చేయూతతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఓపీడీ బ్లాక్, డా. ఎన్టీఆర్ వైద్య సేవ, స్కానింగ్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో యూత్ టైం బ్యాంక్ విధానం కింద యువత అవసరమైన వారికి సేవలు అందించనుంది. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, నిరక్షరాస్యులు తదితరులు అవసరమైన వైద్య సేవలు పొందడంలో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 20 నుంచి 30 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రోజూ సేవలు అందిస్తారు. టైం బ్యాంకు విధానంలో సేవలు అందించే వారికి ఇంటర్న్‌షిప్‌లో ప్రత్యేక మార్కులు కూడా ఇచ్చేందుకు మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యువత అవసరమైన వారికి సేవలు అందించేందుకు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. యూత్ టైం బ్యాంక్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా సేవాభావం పెంపొందడమే కాకుండా, సమాజంలో పరస్పర సహకారం బలపడుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చే వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, నిరక్షరాస్యులకు ఈ సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు చూపుతున్న సేవాస్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా. ఏడుకొండలు, ఆర్ఎంఓ డా. పద్మావతి, ఆంధ్ర లయోలా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వాసవ్య మహిళా మండలి సభ్యులు, యువజన సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణానికి సహకరించండి

- పీస్ కమిటీ సమావేశంలో వికోట సీఐ సోమశేఖర్ రెడ్డి



కోట,మార్చి 17

రాబోయే రెండు ముఖ్యమైన పండుగలను దృష్టిలో ఉంచుకుని అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన వీకోటలో ప్రశాంత వాతావరణానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వి కోట సీఐ సోమశేఖర్ రెడ్డి కోరారు. మంగళవారం వీకోట వెలుగు కార్యాలయ ఆవరణంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.గత ఏడాది వీకోటలో జరిగిన దురదృష్టకర ఘటనతో రాష్ట్ర పోలీసు అధికారుల దృష్టి వీకోటపై కేంద్రీకరించ బడిందని, ఇక్కడి ప్రజలు భావోద్వేగాలను అదుపులో ఉంచుకొని కుల మతాలకతీతంగా సోదర భావంతో ప్రశాంత జీవితాన్ని గడిపేందుకు సహకరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఒకరికొకరు సహకరించుకుంటూ వ్యాపారాలు కొనసాగించుకుంటు ప్రజలు ముందుకెళ్తున్నారని వక్తలు తెలిపారు. ఒకరి పండుగలను మరొకరు దగ్గరుండి ఘనంగా నిర్వహించుకుంటూ హిందూ ముస్లిం భాయి–భాయిగా ఉంటున్నారని ఇదే సఖ్యతను కొనసాగించాలని సర్పంచ్ పిఎన్ లక్ష్మి విజ్ఞప్తి చేశారు. కొంతమంది దుష్టశక్తుల ఆర్థిక–నైతిక ప్రోద్బలాల కారణంగా అప్పట్లో జరిగిన దురదృష్టకర ఘటన నుండి గ్రామం బయటకు వచ్చేందుకు పెద్దలందరూ కృషి చేయాలి అన్నారు.ఎవరైతే సమస్యల కారణమవు తున్నారో వారికి ఇరు వర్గాల వారు సహకరించకుండా చట్ట ప్రకారం శిక్షపడేలా కఠినంగా వ్యవహరిం చాలన్నారు. గతంలో నమోదైన కేసుల్లో ఘటనకు కారుకులనే కాకుండా అక్కడున్న వారందరిపై కేసులు నమోదు చేశారని వారిలో నిజమైన దోషులను గుర్తించి మిగతా వారికి ఉపశమనం కల్పించేందుకు పోలీస్ శాఖ సహకరించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్ర నాయుడు, భాజపా రాష్ట్ర నాయకులు మైందల రామచంద్రుడు ,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎన్ నాగరాజ్, మండల వైస్ ఎంపీపీ డాక్టర్ తమీంఖాన్, వైస్ సర్పంచ్ అక్మల్ లు కోరారు. భవిష్యత్తులో అన్ని వర్గాల నుంచి పెద్దలను ఒక కమిటీగా ఏర్పాటు చేసుకు ని పోలీసు రెవెన్యూ శాఖల సహకారంతో వీకోటలో ప్రశాంత వాతావరణము కొనసాగించు కునేందుకు ప్రత్యేక కమిటీ నియామకం జరగాలని రామచంద్ర నాయుడు అభిప్రాయపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వంగా కలిసిమెలిసి ఉన్న వీకోటలో నిజంగా ఎవరైతే సమస్యలు సృష్టిస్తు న్నారో వారిని ఏ వర్గంలో ఉన్న గుర్తించి పోలీస్ శాఖ శిక్షించాలని మైందల రామచంద్రుడు కోరారు. మండల ప్రజలందరికీ ఉగాది రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ పీస్ కమిటీ నేతృత్వంలో పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు సుబ్బన్న, మైందల రామచంద్రుడు ,రామ్మూర్తి, నవాజ్, మసీదు పెద్దలు సయ్యద్ సలాం భాష, అబ్దుల్ లతీఫ్ సాహెబ్, హజరత్ జహీర్ అహ్మద్, రెవెన్యూ ,పోలీస్ శాఖ అధికారులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెంచ్ భాషతో ఉన్నత విద్యావకాశాలు కెరీర్ అవకాశాలు

- మిరిన్ రికాన్



విజయవాడ, మార్చి 17

స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల లో కెరీర్ గైడెన్స్ సెల్ మరియు ఫ్రెంచ్ విభాగం ఫ్రెంచ్ ఎంబసీ , క్యాంపస్ హైదరాబాద్ ఆధ్వర్యం ఫ్రెంచ్ బాషలో ఉన్నత విద్యావకాశాలు కెరీర్ అవకాశాలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫ్రెంచ్ విభాగాధిపతి డాక్టర్ బ్యూలా నోయెల్ ఫ్రెంచ్ భాష ప్రాధాన్యతని నేటి యువత ఉపాధి అవకాశాలు గురించి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఇన్యాసమ్మ మాట్లాడుతూ నేటి యువత ఎదుగుదలకు ఎన్నో విద్య ఉపాధి అవకాశాలు కు అనేక నూతన కోర్సులు వచ్చాయని అందులో నేటి యువత ఫ్రెంచ్ భాష వైపు అడుగులు వేస్తున్నారని ఈ సెషన్ వల్ల మరిన్ని విషయాలు ఫ్రెంచ్ దేశం లో ఉద్యోగాలు, వీసా ఎలా పొందాలి అనేది వివరించటం జరిగింది అని తెలిపారు. ముఖ్య అతిథి గా పాల్గొన్న మిరిన్ రికాన్ మేనేజర్ ఫ్రెంచ్ క్యాంపస్ హైదరాబాద్ మాట్లాడుతూ భారత్ లో ఎక్కువ శాతం యువత కెరీర్ అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్ అవసరం ఉంది అని ఫ్రెంచ్ భాష నేర్చుకోవటం వల్ల ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా ఉద్యోగా వకాలు మెండుగా ఉన్నాయన్నారు. వీసా , అవకాశాలు వెతుక్కోవడం మరియు ఉద్యోగాల కల్పన వల్ల ఇతర దేశాలలో కల్చర్ తెలుసుకోవటం అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భం గా అలయెన్స్ ఫ్రాంచైజ్ హైదరాబాద్ సంస్థ, స్టెల్లా కాలేజ్ మధ్య ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు . దీని వల్ల ఫ్రెంచ్ భాష లో ప్రావీణ్యం మరియు ఉద్యోగ అవకాశాల కల్పన జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ లావణ్య స్టూడెంట్ డీన్ మరియు సిస్టర్ బాల శ్రీ , డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఆషా, జి.ఉషా కుమారి 80 మంది విద్యార్థినులు అధ్యాపకులు పాల్గొన్నారు.




# సేంద్రియ సాగుకు చేయూత ఇవ్వాలి

- ఔత్సాహిక రైతులకు సులభంగా రుణాలు అందించాలి
- కీలక ప్రగతి సూచికల (కేపీఐ) సాధనలో బ్యాంకులు భాగస్వాములు కావాలి
- డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 17**

జిల్లాను సేంద్రియ వ్యవసాయ ఉత్పతులకు హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించేందుకు బ్యాంకులు కృషిచేయాలని, ఔత్సాహిక రైతులకు సులభంగా రుణాలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ బ్యాంకులకు సంబంధించిన 555 బ్రాంచ్‌ల ద్వారా అందుతున్న సేవలు, వివిధ బ్యాంకింగ్ సూచికల్లో పురోగతి, వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన తదితరాలపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 83,500 కోట్లు లక్ష్యం కాగా డిసెంబర్ 31 నాటికి రూ. 88,269 కోట్ల పంపిణీతో 106 శాతం మేర లక్ష్యాన్ని సాధించినట్లు ఎల్‌డీఎం వివరించారు. ప్రాధాన్య రంగంలో 79 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 123 శాతం మేర చేరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలికి పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రకృతి సాగు ఉత్పత్తులకు డిమాండ్ ఎక్కువైందని.. భవిష్యత్తు అంతా ఆర్గానిక్ ఉత్పత్తుల దేనని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే 50 వేల ఎకరాల్లో ఆర్గానిక్ ఫార్మింగ్ జరుగుతోందని.. వచ్చే ఒకట్రెండు సంవత్సరాల్లో లక్షకు పైగా ఎకరాల్లో ఈ విధానం అమలు దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్గానిక్ ఫార్మింగ్ రైతులకు రుణ మద్దతు అందించాలని సూచించారు. జిల్లాలో వ్యవసాయం, పశుసంవర్ధక, ఎంఎస్ఎంఈల అభివృద్ధిలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలన్నారు. పీఎంఈజీపీ, ముద్రా, పీఎం విశ్వకర్మ, పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ) తదితర పథకాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులు భాగస్వాములుగా వ్యవహరించి, అర్హులైన లబ్ధిదారులకు సమయానికి రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో కీలక ప్రగతి సూచికలు (కేపీఐ) సాధనలో బ్యాంకులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని చెప్పారు. ముఖ్యంగా స్వయం ఉపాధి, స్వయం సహాయక మహిళా సంఘాలు, యువతకు ఆర్థిక సహాయం అందించడంపై దృష్టిసారించాలని సూచించారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త సాకారానికి సమష్టి కృషి అవసరమన్నారు. కౌలు రైతులకు రుణాలకు సంబంధించిన లక్ష్యాలను కూడా చేరుకునేందుకు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. గుంటుపల్లిలోని రైజ్ కేంద్రం కార్యకలాపాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో బ్యాంకింగ్ పాత్రను వివరించారు. కృత్రిమ మేధ (ఏఐ )వంటి సాంకేతిక నైపుణ్యాలు మహిళా పారిశ్రామికవేత్తల జీవితాల్లో ఎలాంటి మార్పులకు కారణమవుతాయనే అంశాన్ని కూడా వివరించారు. సమావేశంలో భాగంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రాధాన్యతరంగ నాబార్డు పొటన్షియల్ లింక్డ్ రుణ ప్రణాళిక (రూ. 39,038 కోట్లు)ను ఆవిష్కరించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఆర్‌బీఐ మేనేజర్ రాజేష్ కుమార్ కుంద్, నాబార్డు డీడీఎం ప్రథ్వి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఆర్‌సేతి డైరెక్టర్ అమరేశ్వర్‌రెడ్డి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.




## ఘనంగా పునీత్ రాజ్‌కుమార్ 51వ జయంతి వేడుకలు

మండలంలోని పాతపేట గ్రామంలో వన్యకుల క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ నటుడు పునీత్ రాజ్‌కుమార్ 51వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. బాణాసంచా పేల్చుతూ "జై పునీత్ రాజ్" అంటూ నినాదాలతో సందడి చేశారు. సుమారు 500 మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి. గణేష్, వన్యకుల క్షత్రియ యూత్ సభ్యులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## డా. కొల్లూరి కి మరో అరుదైన గౌరవం

- ఇండియన్ ఆర్మీ చీఫ్ కమాండర్ కె ఎం కరియప్ప జాతీయ సేవా పురస్కారానికి ఎంపిక

**పెడన, మార్చి 17**



కృష్ణాజిల్లా, పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు పెడన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కు మరో అరుదైన గౌరవం లభించింది. ఇండియన్ ఆర్మీ చీఫ్ కమాండర్ కే ఎం కరియప్ప జాతీయ సేవా పురస్కారానికి డా. కొల్లూరి ఎంపికయ్యారు. విశాఖపట్నం కి చెందిన ప్రతిభ క్రీడ అండ్ సాంస్కృతిక ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు సెలెక్టెడ్ కమిటీ వారు ఇండియన్ ఆర్మీ చీఫ్ కమాండర్ కే ఎం కరియప్ప జాతీయ అవార్డును కరోనా కష్టకాలంలో నిస్వార్ధ సేవలు అందించిన డా. కొల్లూరి కి ఈ నెల 27న విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో 2026 ప్రపంచ కళ దినోత్సవం సందర్భంగా నిర్వహించు అవార్డుల ప్రధాన మహోత్సవ కార్యక్రమంలో కే ఎం కరియప్ప జాతీయ అవార్డును నిర్వాహకులు డా. కొల్లూరికి అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో పాటు పట్టణ పుర ప్రముఖులు పలువురు డా. కొల్లూరికి అభినందనలు తెలియజేశారు.

## మానవజాతి మనుగడకు ఆధారభూతం శ్రీమద్రామాయణం





### డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే మన్నెగుంట గ్రామంలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**కర్నూలు, మార్చి 17**

సమస్త మానవజాతి మనుగడకు ఆధారభూతం శ్రీమద్రామాయణమని, మానవుడు ఎలా జీవిస్తే ఆదర్శ మానవుడవుతాడు, ఎలా నడిస్తే సమాజానికి లోక కంతకుడవుతాడో శ్రీమద్రామాయణం వివరిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో క్రిష్ణగిరి మండలం మన్నెగుంట గ్రామంలోని శ్రీ సుంకుల పరమేశ్వరి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాలను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. మొదటిరోజు స్వాత్మానందస్వామి ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ధార్మిక ప్రవచకులు డాక్టర్ యం మధుసూధనా చార్యులు, చిందుకూరి నడిపి వెంకటేశ్వర్లు, సి. రాముడు, కూరాకుల రాముడు, చిన్న హనుమంతు, పూల వెంకటేశ్వర్లు, పెద్దకురువ బజారి, కె. వెంకటేశ్వర్లు,పూజారి బోయ చంద్రన్న, లక్ష్మీదేవి, సి. రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు ఉగాది కానుకగా బట్టల పంపిణీ



**బంగారుపాళ్యం, మార్చి 17** బంగారుపాళ్యం గిరి జన గురుకుల పాఠశాలలోవిద్యార్థులకు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షుడుజన్నావుల సురేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంజరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్యసమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 110 మంది విద్యార్థులకు ఉగాది పండుగ సందర్భంగా కొత్త బట్టలను పంపిణీ చేశారు. పండుగను పురస్కరించుకుని ముందస్తుగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జన్నావుల సురేంద్ర మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట సుబ్బయ్యతో పాటు ఆర్టీఐ కమిటీ సభ్యులు వెంకట రమణ, జయచంద్ర, రెడ్డప్ప, శంకర్ నాయుడు, ప్రతాప్ కుమార్, శ్రీనివాసులు, హేమచంద్ర, సుందరం, వేణుగోపాల్ నాయుడు, సాంబయ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం




## ధరలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సామ్రాజ్యవాదం

**మొత్తానికి ఈ వారంలో ముడి చమురు అంతర్జాతీయ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల హద్దు దాటేసింది. 110 డాలర్లకు చేరింది కూడా. ఇరాన్ మీద సామ్రాజ్యవాదుల దాడి ప్రారంభం అవడానికి ముందు వరకూ ముడి చమురు ధర బ్యారెల్‌కు 69 డాలర్లుగా ఉండేది. అందుచేత కేవలం ఒక్క వారంలో అమాంతం ఇంతలా పెరిగిపోవడం చాలా తీవ్రమైన విషయం. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వలన వాస్తవంగా ఏర్పడిన చమురు సరఫరా కొరత వలన పెరిగిన ధర కన్నా, చమురు కొరత ఏర్పడబోతోందన్న ముందస్తు అంచనాల వలన పెరిగిన ధర ఎక్కువ. 1973 నాటి పెరుగుదలకు ఇది పూర్తిగా భిన్నం. అప్పుడు ధర పెరుగుదలకు చమురు కొరత కారణం కాదు. చమురు ఉత్పత్తి దేశాలు ముడి చమురు ధరను పలు రెట్లు పెంచివేయడం కారణం. 2008లో, 2022లో కూడా చమురు ధరలు పెరిగాయి. కాని వాటికన్నా కూడా ప్రస్తుత పెరుగుదల విభిన్నమైనది.**

2008లో గాని, 2022లో గాని చమురు ధరలు పెరగడం స్వల్పకాలిక స్వభావం కలిగినవి. 2008లో చైనా నుండి చమురుకు డిమాండ్ పెరిగింది. నైజీరియా నుండి, పశ్చిమాసియా నుండి చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. ఈ రెండు కారణాలూ స్వల్పకాలికమైనవే. అందుకే ఆ పెరుగుదల నిలవలేదు. అదేవిధంగా 2022లో కూడా జరిగింది. అప్పుడు ఉక్రెయిన్ యుద్ధం సాకుతో రష్యాపై అమెరికా ఆంక్షలు విధించింది. కాని రష్యా ఆ ఆంక్షలను బేఖాతర్ చేసి తన చమురు సరఫరాలో ఎక్కువ భాగాన్ని కొనసాగించింది. దానికి తోడు అమెరికా నుండి కూడా ముడి చమురు యూరపు దేశాలకు సరఫరా అయింది. అయితే దాని ధర ఎక్కువ. ఏమైనా, ఆ పెరుగుదల కూడా ఎక్కువ కాలం కొనసాగలేదు. ఇప్పుడు ధర పెరగడానికి కారణం అమెరికా-ఇజ్రాయిల్ తన మీద సాగిస్తున్న దాడికి ఇరాన్ నుంచి వచ్చిన ప్రతిస్పందన. ఈ యుద్ధం కొనసాగినంత కాలమూ పెరిగిన చమురు ధర కూడా అలానే కొనసాగుతుంది. ఈ యుద్ధం ముగిసేది ఎప్పుడో కనుచూపు మేరలో కానరావడం లేదు. హార్ముజ్ జలసంధి ద్వారా ఒక్క ఇరాన్ సరఫరాలే కాదు, అనేక దేశాల నుండి సరఫరాలు రవాణా అవుతాయి. వాటన్నింటి మొత్తం కలిపితే రష్యా నుండి సరఫరా అయ్యే ముడి చమురు కన్నా రెట్టింపు ఉంటుంది. ఇటువంటి సమయంలో చమురు ధరల విషయంలో స్పెక్యులేషన్‌ను చల్లార్చేబదులు, డొనాల్డ్ ట్రంప్ ఆ సమస్యను కొట్టిపారేశాడు. యుద్ధం ద్వారా సాధించవలసిన లక్ష్యాలతో పోల్చినప్పుడు "ఈ పాటి చిన్న మూల్యం" చెల్లించక తప్పదు అన్నాడు.ముడి చమురు ధరల పెరుగుదల ఇదే విధంగా కొంతకాలం పాటు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద దాని ప్రభావం చాలా ప్రగాఢంగా పడుతుంది. చమురు ఉత్పత్తుల కొనుగోలు చేసే వినియోగదారుల మీద ప్రత్యక్షంగా భారం పడి ద్రవ్యోల్బణానికి దారి తీయడం జరుగుతుంది. దానికన్నా ముఖ్యంగా చమురు ఇంధనాన్ని ఉపయోగించి చేసే అనేక ఉత్పత్తుల, సేవల ధరలు కూడా పెరుగుతాయి. ఎరువుల ధరలు పెరుగుతాయి. వాటిని ఉపయోగించేది వ్యవసాయంలో. అందుచేత ఆహారధాన్యాల ధరలు పెరుగుతాయి (రైతులకు లభించే ధరలు తగ్గిపోకుండా ఉంటే). ఇవిగాక, అన్ని సరుకుల రవాణా చార్జీలు పెరుగుతాయి. దాంతో ద్రవ్యోల్బణానికి గట్టి ఊపు వస్తుంది.అమాంతం వచ్చిపడిన అదనపు లాభాల వలన ప్రయోజనం పొందినవారు వాటిని బ్యాంకుల్లో భద్రంగా దాచుకుంటారు. అందువలన వారి అదనపు ఆదాయం నుండి మార్కెట్ లోకి అదనపు డిమాండ్ రూపంలో వచ్చేది ఏమీ ఉండదు. కాని ధరలు పెరిగినందువలన తక్కినవారు తమ డిమాండ్‌ను కుదించుకోవలసి వస్తుంది. అందువలన ప్రపంచం మొత్తం మీద డిమాండ్ కుదించుకుపోతుంది. దాని వలన ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం పెరుగుతుంది.ఒకవేళ చమురు ఉత్పత్తిదారులు కావాలనే ఈ ధర పెరుగుదల తెచ్చిపెట్టారనుకోండి (1970 దశకంలో మాదిరిగా). అప్పుడు ఆ ధరల పెరుగుదల వలన నష్టపోతున్న దేశాల ప్రభుత్వాలు తమ దేశాల్లో ఆర్థిక మాంద్యం పెరిగిపోకుండా నివారించడానికి తమ తమ స్థూల డిమాండ్‌ను పడిపోకుండా నిలబెట్టవచ్చు. అందుకు అవసరమైన ద్రవ్య విధానాన్ని, నగదు సరఫరా విధానాన్ని చేపట్టవచ్చు (అయితే 1970 దశకంలో ప్రభుత్వాలు ఏవీ ఇలా చేయలేదనుకోండి). కాని చమురు సరఫరాకే కొరత ఏర్పడి దాని వలన ముడి చమురు ధర పెరిగినప్పుడు నెలకొనే ఆర్థిక మాంద్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టడం సాధ్యం కాదు. వాస్తవానికి చమురు సరఫరాలో కొరత ఏర్పడినప్పుడు దానిని అధిగమించడానికి ఆర్థిక మాంద్యమే పరిష్కారం అవుతుంది. అందుచేత ఇప్పుడు ముడిచమురు ధర పెరిగినందువలన ద్రవ్యోల్బణంతో కూడిన ఆర్థిక మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనివార్యంగా తలెత్తుతుంది.ఈ ఆర్థిక మాంద్యం చమురు ఉత్పత్తి దేశాలతో సహా అన్నింటిలోనూ తలెత్తుతుంది (అయితే చమురు ఉత్పత్తి దేశాలు దీని ప్రభావాన్ని తగ్గించేవిధంగా తమ తమ దేశాల్లో చర్యలు చేపట్టగలుగుతారు). ఇక మూడవ ప్రపంచ దేశాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. దానికి అదనపు కారణాలు తోడవుతాయి. చమురు ధరలు పెరిగినందువలన దానిని దిగుమతి చేసుకునే దేశాల విదేశీ మారక చెల్లింపు ఖాతాలు కరిగిపోయి లోటు పెరుగుతుంది. అదే చమురు దిగుమతి చేసుకునే సంపన్న దేశాల విషయంలోనైతే, వాటికి బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి తయారుగా ఉంటాయి. ఆ బ్యాంకుల దగ్గర చమురు ఎగుమతి చేసే దేశాల నుండి వచ్చిన అదనపు ధనం చేరుతుంది. దానినుండి చమురు దిగుమతి చేసుకునే సంపన్న దేశాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వగలుగుతాయి. కాని మూడవ ప్రపంచ దేశాలకు ఆ విధంగా రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావు. అప్పుడు వారి కరెన్సీల విలువలు పడిపోవడమే కాక, షరతుల్లో భాగంగా మరింత కఠినమైన "పొదుపు చర్యలను" అమలు చేయడానికి ఈ దేశాలు తలొగ్గవలసి వస్తుంది. లేదా తమ దేశాల్లోని విలువైన ఖనిజ సంపదను తాకట్టు పెట్టడమో లేక అమ్ముకోవడమో చేయాల్సి వస్తుంది. ఎప్పుడైతే కరెన్సీ విలువ పడిపోతుందో అప్పుడు ద్రవ్యోల్బణం మరింత విజృంభిస్తుంది. ఎందుకంటే కరెన్సీ విలువ పడిపోవడం వలన ముడిచమురు దిగుమతులు మరింత ఖరీదౌతాయి. దానితోబాటు ఈ దేశాల్లో మాంద్యం మరింత ఎక్కువ తీవ్రతను కనపరుస్తుంది. మాంద్యానికి దారి తీయడం ఒక్కటే కారణం కాదు. విదేశీ రుణదాతలు "పొదుపు చర్యల" పేరుతో విధించే షరతుల కారణంగా ప్రజల వినిమయశక్తి మరింత పడిపోతుంది. మరింతగా మాంద్యం నెలకొంటుంది. దాని వలన ప్రజల ఇబ్బందులు మరింత పెరుగుతాయి. అమెరికా చట్టవిరుద్ధంగా ప్రారంభించిన ఈ అనైతిక యుద్ధాన్ని వెంటనే నిలుపు చేయాలని డిమాండ్ చేయడం, అమెరికాపై ఒత్తిడి పెంచడం ఈ మూడవ ప్రపంచ దేశాలకు మరింత ఎక్కువ అవసరం.



# వైఎన్ఆర్ చారిటీస్ సేవా దృక్పథం

## నిరుపేదలకు చీరల పంపిణీ

**ఎనికెపాడు, మార్చి 18**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గన్నవరం నియోజకవర్గం ఎనికెపాడు గ్రామంలో ఆదివారం నాడు వైఎన్ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో ఉదారత చాటుకున్నారు. ట్రస్ట్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ నేతృత్వంలో గ్రామంలోని నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు మరియు వితంతువులకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ట్రస్ట్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ మాట్లాడుతూ, పండుగ వేళ పేదవారి ముఖాల్లో చిరునవ్వు చూడటం తనకు ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. సమాజంలో నిజంగా సహాయం అవసరమైన వారు ఎక్కడున్నా, వారికి తన వంతుగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. పేదలకు చేసే సేవలోనే నిజమైన తృప్తి ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో వైఎన్ఆర్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. తమకు పండుగ కానుకను అందజేసిన జయప్రకాష్ కి లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాప్ స్వర్ణోత్సవాలు ప్రారంభం

## వర్క్‌షాప్ టూర్ నిర్వహణ



**ఇబ్రహీంపట్నం, మార్చి 17**

రాయనపాడు రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ స్థాపనకు 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ ఎస్. శ్రీనివాస్ మీడియా ప్రతినిధులకు వర్క్‌షాప్ టూర్ నిర్వహించి కార్యకలాపాలను వివరించారు. వర్క్‌షాప్ ప్రారంభమై ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్నందుకు సంతోషం వ్యక్తం చేసిన ఆయన, ఈ వేడుకల్లో ప్రతి కార్మికుడు పాల్గొంటున్నారని తెలిపారు. స్వర్ణోత్సవాల సందర్భంగా రైల్వే అధికారులు, సిబ్బంది కలిసి వ్యాగన్లు, బోగీలు, వీల్స్ తయారీ ప్రక్రియను, ఇంజనీరింగ్ విధులను ప్రదర్శించారు.టూర్‌లో భాగంగా వివిధ విభాగాలను సందర్శించిన చీఫ్ మేనేజర్, వ్యాగన్ల సర్వీసింగ్, రీహాబిలిటేషన్ ప్రక్రియలను మీడియాకు క్షేత్రస్థాయిలో వివరించారు. ఈ వర్క్‌షాప్ మొత్తం 310 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉందని, నెలకు 650 వ్యాగన్ల నిర్వహణ సామర్థ్యంతో దక్షిణ భారతదేశంలో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు.ఇక్కడ సుమారు 2,400 మంది సిబ్బంది పనిచేస్తుండగా, దేశంలోనే రెండవ అతిపెద్ద వ్యాగన్ వర్క్‌షాప్‌గా రాయనపాడు గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు వైభవంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, చీఫ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు, వర్క్‌షాప్ సిబ్బంది పాల్గొని వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరించారు.

## పోలీసుల నిర్లక్ష్యంతో బీటెక్ విద్యార్థి మృతి..

# రూ. కోటి ఎక్స్‌గ్రేషియా డిమాండ్

**గన్నవరం, మార్చి 17**



కృష్ణా జిల్లా గన్నవరం మండలంలో ట్రాఫిక్ పోలీసుల అత్యుత్సాహం కారణంగా బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి డిమాండ్ చేశారు .మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన ఆమె, కేసరపల్లికి చెందిన పలగాని ప్రణయ్ మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ప్రణయ్, తన తమ్ముడిని ట్యూషన్‌కు తీసుకెళ్తుండగా శ్రీనివాస్ హ్యాచరీస్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు. పోలీసులు అకస్మాత్తుగా బైక్ హ్యాండిల్ పట్టుకోవడంతో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగి, ప్రణయ్ అక్కడికక్కడే మృతి చెందాడని, అతని తమ్ముడికి తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం విజయవాడలో చికిత్స పొందుతున్నాడని వివరించారు. బాధిత కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సాయం అందించడంతో పాటు, గాయపడిన తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఆసుపత్రి ఖర్చులను ప్రభుత్వం భరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఖండిస్తూ, బాధితులపైనే నిందలు మోపడం సరికాదని ఎలిజబెత్ రాణి విమర్శించారు. కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉన్న సమయంలో వారికి అండగా నిలవాల్సింది పోయి ఆరోపణలు చేయడం అనుచితమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా జిల్లా స్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# పారిశుధ్య కార్మికులకు దుస్తులు, నగదు పంపిణీ

**వి.కోట, మార్చి 17**



పవిత్ర రంజాన్ మాసం మరియు ఉగాది పండుగల సందర్భంగా చిత్తూరు జిల్లా, వి.కోట పంచాయతీ పట్టణ పారిశుధ్య కార్మికులకు ఉపాధ్యక్షుడు డాక్టర్ తమీమ్ ఖాన్ దుస్తులు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజానికి ముఖ్యమైన సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని తెలిపారు. పండుగల వేళ వారికి సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు.పట్టణ ప్రజలకు, వారి కుటుంబ సభ్యులకు రంజాన్ మరియు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరి జీవితాల్లో ప్రశాంతత, సంతోషం, ఆయురారోగ్యాలు నిండాలని ఆకాంక్షించారు.

# నున్న గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం

- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**నున్న, మార్చి 17 (**

విజయవాడ రూరల్, నున్న లో సాగును లాభసాటిగా మార్చడమే కాకుండా, దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతన్న మీకోసం' కార్యక్రమం మంగళవారం విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతన్నలతో నేరుగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల ఖాతాల్లో నిధులు జమ కావడంపై ఆయన ఆరా తీశారు. మెజారిటీ రైతులకు నగదు జమ అయిందని, సాంకేతిక కారణాల వల్ల ఒకటి రెండు చోట్ల నిధులు రాని పక్షంలో వెంటనే అగ్రికల్చర్ ఆఫీసర్లు స్పందించి ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మొదటి రెండు విడతలు పడిన వారికి మూడో విడత కూడా కచ్చితంగా అందుతుందని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతు గడప దగ్గరికే పాలనను తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ఈ వారం రోజుల కార్యక్రమాన్ని రూపొందించిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 2,000 తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 4,000 కలిపి మొత్తం నిధులను పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. గతంలో ప్రకాశం జిల్లా దర్శి, కడప జిల్లా కమలాపురం లో రెండు విడతల కార్యక్రమాలు పూర్తి చేసుకుని, మూడవ విడత నిధుల పంపిణీని గన్నవరం నియోజకవర్గ సరిహద్దు గ్రామమైన సూరంపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. నున్న గ్రామ పెద్ద నాగేశ్వర రెడ్డి ఇంటికి వెళ్తే వ్యక్తిగత పనులు కోరకుండా గ్రామంలోని సాయిబాబా గుడి రోడ్డు వేయాలని కోరడంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే 7-8 నెలల్లో నిధులు సమకూర్చుకుని ఈ రోడ్డును పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మడిచర్లలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కాలనీ రోడ్డు పనుల కోసం రూ. 90 లక్షలు కేటాయించి పూర్తి చేశామని, రామవరప్పాడు, నారాయణ అప్పారావుపేట వంటి గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని కూడా చక్కదిద్దామని చెప్పారు. అలానే మానికొండ నుంచి తరిగొప్పల వరకు ఉన్న భారీ గోతులను పూడ్చేందుకు నిధులు కేటాయించామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 80% మేర గుంతల పూడ్చివేత పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20% కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కొత్త రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, గన్నవరం మెయిన్ సెంటర్ మరియు దావాజీగూడెం రోడ్ల కోసం కృష్ణా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రూ. 4 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. నున్న గ్రామంలోని రోడ్ల విస్తరణకు రూ. 4.50 కోట్లు కేటాయించాలని మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డిని కోరానని, ఆ నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రైతు సోదరుల కోసం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం తమ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని యార్లగడ్డ వెంకట్రావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అనంతరం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ ఉన్న విద్యా వసతులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. విద్యార్థుల చదువుపై ఆసక్తిని పెంచేలా ఆయన పలు ప్రశ్నలు అడిగారు. మీకు ఇష్టమైన సబ్జెక్టు ఏది?, పాఠాలు ఎలా అర్థం అవుతున్నాయి?, భవిష్యత్తులో మీరు ఏ స్థాయికి ఎదగాలనుకుంటున్నారు? అని ఆరా తీశారు. పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆయన వారిని ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఆహారం అందుతోందా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని రిజిస్టర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని ఇతర మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులతో చర్చించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, క్లస్టర్ ఇంచార్జి గుజ్జర్లపూడి బాబురావు, గ్రామ టిడిపి అధ్యక్షులు కలతోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాసరావు, మాదు శివరాం ప్రసాద్, బొకినాల తిరుపతిరావు, యార్కరెడ్డి కోటిరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, బేతపూడి ముత్తయ్య, కందుల లీలాకృష్ణ, అంగజాల శివయ్య, యార్కరెడ్డి వెంకటరెడ్డి, గండికోట సీతయ్య, ఢిల్లీ కోటేశ్వరరావు, తగరం కిరణ్, మేడేపల్లి రమ, సొంగా సంతోష్, పరుచూరి నరేష్, పట్టపు చంటి, చల్లగాలి సునీల్, మాదు మహేష్, బెజవాడ రామకృష్ణ, పావులూరి హనుమంతరావు, భూక్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా "రైతన్నా - మీ కోసం"

# వారోత్సవాలు నిర్వహణ





**యాదమరి, మార్చి 17**

చిత్తూరు జిల్లా యాదమరి మండలం దాసరపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో "రైతన్నా – మీ కోసం" వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే డా. కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళి, సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమా, మండల రెవెన్యూ అధికారి పార్థసారథి, ఎంపీడీవో పెంచల కిషోర్, మండల వ్యవసాయ అధికారి దీప, గ్రామ వ్యవసాయ అధికారులు అనిత, తులసిరామ్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా "రైతన్నా -- మీ కోసం" కార్యక్రమ లక్ష్యాలను రైతులకు వివరించారు. ముఖ్యమంత్రి సందేశ పత్రాలను అందజేసి సుస్థిర వ్యవసాయ పద్ధతులు, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహంపై అవగాహన కల్పించారు. దాసరపల్లి గ్రామానికి వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు మురార్జి యాదవ్, కార్యదర్శి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి హేమగిరి, ధరణి ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.

## కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల

# పురుషుల ఖో-ఖో పోటీలు ప్రారంభం



**విజయవాడ స్పోర్ట్స్, మార్చి 17**

విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల పురుషుల ఖో-ఖో పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీలలో మొత్తం ఎనిమిది కళాశాలలు పాల్గొన్నాయి. పోటీలు నాకౌట్ కమ్ లీగ్ విధానంలో నిర్వహించబడ్డాయి.నాకౌట్ దశలో జరిగిన మొదటి మ్యాచ్‌లో విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, డాక్టర్ ఎల్.హెచ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పై, రెండో మ్యాచ్‌లో పి.బి సిద్ధార్థ కళాశాల ఏషియన్ కాలేజ్ పై,మూడో మ్యాచ్‌లో ఆంధ్ర లయోలా కాలేజ్ ఎస్.ఆర్.ఆర్ కళాశాల పై,నాలుగో మ్యాచ్‌లో వికాస్ కాలేజ్ ఏ.ఎన్.ఆర్ కళాశాల పై విజయం సాధించి లీగ్ దశలోకి ప్రవేశించాయి.లీగ్ దశలో జరిగిన మొదటి మ్యాచ్‌లో పి.బి సిద్ధార్థ కళాశాల, ఆంధ్ర లయోలా కాలేజ్ తలపడగా పి.బి సిద్ధార్థ కళాశాల విజయం సాధించింది.రెండవ లీగ్ మ్యాచ్‌లో వికాస్ కాలేజ్, విజయ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మధ్య జరిగిన పోటీలో విజయ కాలేజ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మేక రమేష్ గారు, డీన్ ప్రొఫెసర్ రాకేష్ సి. జంపాల గారు మరియు ఆంధ్రప్రదేశ్ ఖో-ఖో ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి. ఎస్.ఎస్. ప్రసాద్ గారు క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి ఆశీస్సులు అందజేశారు. ఈరోజు మిగిలిన లీగ్ మ్యాచ్‌లు నిర్వహించబడనున్నాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు.



# మిడ్ డే మీల్స్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే మురళీమోహన్

**యాదమరి, మార్చి 17 (**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలంలోని కే గొల్లపల్లి పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం మిడ్ డే మీల్స్ పథకాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మొరార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోనపల్లి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహారపు రుచులను పరిశీలించారు. అనంతరం మిడ్ డే మీల్స్ నాణ్యతపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, యాదమరి మండలం టిడిపి అధ్యక్షుడు మురార్జీ యాదవ్, రఖి, చిట్టిబాబు,టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం మూడో వార్షికోత్సవాలు

**యాదమరి, మార్చి 17**



చిత్తూరు జిల్లా యాదమరి మండలంలోని శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో మూడో వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు వేడుకలను కినటంపల్లె రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.సోమవారం యాదమరి మండలం పెరియంబాడీ గ్రామస్థుల ఆధ్వర్యంలో గణపతి పూజ, భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి రుద్రాభిషేకం, రుద్ర హోమాలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రత్యేక అలంకరణలతో పూజలు జరిగాయి. మధ్యాహ్నం మొలకమడుగు గ్రామస్థులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 7.30 గంటలకు సింహవాహనంపై స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లి, రాత్రి 10.30 గంటల వరకు వేడుకలు కొనసాగించారని తెలిపారు. ఇంకా జరగనున్న రెండు రోజుల కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలని ఆలయ కమిటీ సభ్యులు సి. రవి, కె. భక్తవత్సలం, మురగయ్య, నాగరాజు కోరారు.

# సమాజానికి చీడలా.. డ్రగ్స్ మహమ్మారి!

సంపాదకీయం

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడం లేదు. కఠిన చర్యలు తీసు కోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచేయాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత శనివారం రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సవిపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫఎసఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంచర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ నక్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తిస్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌషిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.

# మీ సాయం మాకక్కర లేదు..



**అమెరికా చాలా శక్తివంతమైన దేశం**
**హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం**
**మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక**

వాషింగ్టన్ :
హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం విడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంత ప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

**కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి**
**దాడిలో 400 మంది మృత్యువాత**
**మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం**
**దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం**



**కాబూల్,మార్చి17(నినాదం):**

అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలా ఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలా వుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియాలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఫ్గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని అఫ్గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

## కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

**అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి**
**పాక్ తీరును తీవ్రంగా తప్పుపట్టిన భారత్**

అఫ్గానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.



# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది



**సిఎం సంతకానికే దిక్కలేకపోతే ఎలా**
**తెలంగాణ అసెంబ్లీలో**
**గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ విసుర్లు**

హైదరాబాద్ :
తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆరఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది?తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు.కాంగ్రెస్ నేతలు దిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆరఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్ధాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆరఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# గ్రీన్ టీ కాదు.. గ్రీన్ కాఫీని ఎప్పుడైనా రుచి చూశారా?



## ఇది తాగితే శరీరంలో జరిగే మార్పులివే..



బరువు తగ్గడానికి చాలా మంది గ్రీన్ టీని ఎంచుకుంటారు. అయితే మీకు తెలుసా.. గ్రీన్ టీ మాత్రమే కాదు. గ్రీన్ కాఫీ కూడా ఉంది. ఇది కూడా త్వరగా బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. వినడానికి మీకు ఆశ్చర్యకరంగా ఉన్నా.. గ్రీన్ కాఫీ పేరు చాలా మందికి తెలియదు. గ్రీన్ కాఫీ ఎక్కడ దొరుకుతుంది? తాగితే ఏమౌతుంది? వంటి ఎన్నో విషయాలు మీ కోసం. గ్రీన్ టీ లాగా, గ్రీన్ కాఫీ కూడా ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన పానీయం. గ్రీన్ కాఫీని ఆహారంలో చేర్చుకోగలిగితే బరువు తగ్గడమే కాకుండా అనేక రకాల వ్యాధుల నుంచి బయటపడతారు. గ్రీన్ కాఫీ బీన్స్ నుంచి గ్రీన్ కాఫీ తయారు చేస్తారు. గ్రీన్ కాఫీ సహజ రుచిని తీసుకురావడానికి దీనిని వేయించరు. గ్రీన్ కాఫీలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయనే భయంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు టీ, కాఫీలు తాగకూడదని అనుకుంటారు. అయితే గ్రీన్ కాఫీతో ఆ భయం లేదు. రోజువారీ జాబితాలో గ్రీన్ కాఫీని చేర్చుకోవచ్చు. గ్రీన్ కాఫీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. ఇందులో చక్కెరను కలుపుకోకూడదు. చక్కెర కలిపిదే ప్రయోజనానికి బదులుగా హాని జరుగుతుంది. గ్రీన్ కాఫీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఔషధంలా పనిచేస్తుంది. గ్రీన్ కాఫీ తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి. గ్రీన్ కాఫీ శరీరాన్ని డిటాక్సిఫై చేయడానికి పనిచేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మం, జుట్టు సంరక్షణకు ఉపయోగపడుతుంది.

# అందుకే పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలట.. ఎన్ని లాభాలో



చాలా మంది మహిళలు ప్రతి నెలా పీరియడ్స్ టైంలో భరించలేని కడుపు నొప్పిని అనుభవిస్తుంటారు. దీనివల్ల ఆఫీస్‌కు వెళ్లడం కష్టంగా మారుతుంది. కడుపు నొప్పి, తిమ్మిర్లు, ఉబ్బరం కారణంగా ఏమీ తినాలని అనిపించదు. చాలా అసౌకర్యంగా ఉంటుంది. మీకు కూడా ఇలాంటి రోజుల్లో సమస్యలు తలెత్తితే ఈ కింది జాగ్రత్తలు తీసుకోండి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పీరియడ్స్ సమయంలో వచ్చే సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఐరన్ అధికంగా ఉండే బెల్లం సర్వరోగనివారిణి పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలి. ఇది కడుపు నొప్పి నుంచి తక్షణ ఉపశమనం ఇచ్చి, శక్తిని ఇస్తుంది. బెల్లంలో చాలా ఎక్కువ మొత్తంలో ఐరన్ లభిస్తుంది. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తిని అందుతుంది. ఇది పీరియడ్స్ సమయంలో రక్త నష్టాన్ని కూడా భర్తీ చేస్తుంది. బెల్లం ఉపయోగం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరి నుంచి ఉపశమనం అందిస్తుంది. అలాగే రక్తం కొరత ఉండదు. దీనితో పాటు పీరియడ్స్ సమయంలో ఐరన్ పుష్కలంగా ఉండే పాలకూర, దానిమ్మ, బీట్‌రూట్ వంటి వాటిని కూడా తీసుకోవాలి. బెల్లం తినడం వల్ల కడుపునొప్పి నుంచి తక్షణ ఉపశమనం లభించి, నొప్పిని కూడా తగ్గిస్తుంది. బెల్లంలోని మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు కండరాలను రిలాక్స్ చేసి, తిమ్మిరి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. మానసిక స్థితిని మెరుగుదల పీరియడ్స్ సమయంలో బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. చిరాకు తగ్గుతుంది. బెల్లం వాడకం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్లు పెరుగుతాయి. దీని కారణంగా ఎక్కువ రిలాక్స్‌గా ఉంటారు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది చాలా మంది మహిళలు పీరియడ్స్ సమయంలో మలబద్ధకం, ఉబ్బరం సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. పీరియడ్స్ సమయంలో బెల్లం తప్పనిసరిగా తీసుకోవాలి. ఎందుకంటే ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. పీరియడ్స్ సమయంలో హార్మోన్లలో మార్పుల కారణంగా మానసిక అస్థిరత ఏర్పడుతుంది. బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. పోషకాహార నిపుణులు ప్రకారం.. పీరియడ్స్ ప్రారంభానికి 4 నుంచి 5 రోజుల ముందు నుంచే.. బెల్లం తీసుకోవడం ప్రారంభించాలి.

# రోజూ ఈ మొక్క ఆకులు నాలుగైదు నోట్లో వేసుకుంటే ఏ రోగం దరిచేరదు..



తులసి దాదాపు ప్రతి ఇంట్లో కనిపించే మొక్క. చాలా సులభంగా పెరుగుతుంది. ఈ చిన్న మొక్క శరీరం నుంచి ఎన్నో వ్యాధులను దూరం చేస్తుంది. ఇంట్లో తులసి చెట్టు తప్పకుండా పెంచుకోవాలని మన పూర్వికుల కాలం నుంచి పెద్దలు చెబుతుంటారు. ఈ మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు నిండి ఉంటాయి. ఆయుర్వేదంలో కూడా దీనికి అధిక ప్రాముఖ్యత ఉంది. తులసి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది యాంటీఆక్సిడెంట్‌గా ఉండటమే కాకుండా, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఈ అంశాలన్నీ అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. తులసి ఆకులు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడతాయి. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఆకు వల్ల కలిగే లాభాలు అన్నీఇన్నీకావు. తులసిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇది జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తులసి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. తులసి రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి తులసి ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది జ్వరం, చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రోజూ నాలుగైదు తులసి ఆకులను తింటే ఎన్నో రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. అయితే సరైన పద్ధతిలో తింటేనే ఈ ప్రయోజనాలన్నీ పొందవచ్చు. తులసితో టీ కూడా తాగవచ్చు. దీని ఆకులను ఎండబెట్టి, నీటిలో మరిగించి అయినా తాగొచ్చు

# అల్లాన్ని నేరుగా తినలేరా..?



అయితే అల్లం పాలను తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలను పొందవచ్చు..! అల్లంను మనం నిత్యం అనేక రకాల వంటల్లో వేస్తూనే ఉంటాం. ముఖ్యంగా మసాల వంటకాల్లో అల్లాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అల్లంను వేయడం వల్ల వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఆయుర్వేద ప్రకారం అల్లంలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కనుక అల్లాన్ని నేరుగా తినమని లేదా అల్లం రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అల్లం ఘాటుగా ఉంటుంది కనుక దీన్ని కొందరు నేరుగా తినలేరు. కానీ అల్లాన్ని పాలలో వేసి మరిగించి కూడా తీసుకోవచ్చు. ఇలా తీసుకున్నా కూడా ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. అల్లం, పాలు కాంబినేషన్ చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమం అనేక లాభాలను అందిస్తుంది. అల్లం పాలను రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పలు వ్యాధులు సైతం అవుతాయి.

# మీ చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు ముఖ సౌందర్యం పెరగాలంటే.. రోజూ ఈ పండ్లను తినాలి..!



చర్మం మృదువుగా,తేమగా ఉండడంతోపాటు సురక్షితంగా ఉండాలని, కాంతివంతంగా మారి మెరవాలని చాలా మంది కోరుకుం టుంటారు. అందులో భాగంగానే చర్మ సంరక్షణకు అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్ చికిత్సలను తీసుకుంటారు. ఇంకా కొందరు ఇంట్లోనే పలు చిట్కాలను పాటిస్తుంటారు. అయితే చర్మ సౌందర్యం, సంరక్షణ కోసం ఆయా చికిత్సలను, చిట్కాలను పాటించడం సరైందే అయినప్పటికీ ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మనం తినే ఆహారం సరిగ్గా ఉంటేనే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మ సంరక్షణకు ఆహారం కూడా చాలా ముఖ్యమైందే అన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఈ క్రమంలోనే పలు రకాల పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఇక ఆ పండ్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. **బెర్రీలు, సిట్రస్ ఫలాలు..** స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇవి చర్మాన్ని దృఢంగా మార్చి యవ్వనంగా ఉండేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఫ్రీ ర్యాడికల్స్ తొలగిపోతాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకోవచ్చు. చర్మం మృదువుగా మారి కాంతివంతంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లను కూడా తింటుండాలి. ఈ పండ్లలోనూ విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లను తింటుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే నల్లని మచ్చలు, మొటిమలు తొలగిపోతాయి. చర్మం సురక్షితంగా ఉంటుంది. **బొప్పాయి పండ్లు..** బొప్పాయి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లు మన చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియేటింగ్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. బొప్పాయి పండ్లలో ఉండే వటమిన్లు ఎ, సి, ఇ వల్ల మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. నల్లని మచ్చలు తొలగిపోతాయి. బొప్పాయిలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాల వల్ల చర్మ వాపులు తగ్గిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో పాలిఫినాల్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. ముఖ సౌందర్యం పెరుగుతుంది. **అరటి పండ్లు..** అరటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందిస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు ఎ, బి, ఇ అధికంగా ఉంటాయి. కనుక అరటి పండ్లను తింటే పొడి చర్మం ఉన్నవారికి మేలు జరుగుతుంది. అరటి పండ్లను ఫేస్ ప్యాక్‌గా కూడా ఉపయోగించవచ్చు. దీంతో ముఖానికి కావల్సిన తేమ, మృదుత్వం లభిస్తాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. పుచ్చకాయలు, కీరదోసలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే వీటిని తరచూ తింటుండాలి. అదేవిధంగా ద్రాక్ష పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని సూర్య కిరణాల బారి నుంచి రక్షిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా ఆయా పండ్లను రోజూ తింటుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు రాకుండా యవ్వనంగా ఉంటారు.

# రాత్రి పూట మీరు తినే ఆహారంలో వీటిని చేర్చుకోండి.. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు..



అధికంగా బరువు ఉన్నవారు రాత్రి పూట భోజనాన్ని త్వరగా ముగిస్తుంటారు. రాత్రి పూట తినే ఆహారంలో చపాతీలను చేర్చుకుంటారు. అంతే కాదు రాత్రి పూట ఆహారాన్ని తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం పట్ల అనేక జాగ్రత్తలను పాటిస్తుంటారు. అయితే బరువు తగ్గాలంటే పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. సరైన పోషకాలు ఉండే ఆహారాలను తింటే బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ క్రమంలోనే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గుతారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి కనుక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అధిక బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్న వారు రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. స్కిన్‌లెస్ చికెన్, చేపలు, కూరగాయలు..రాత్రి పూట ఆహారంలో స్కిన్ లెస్ చికెన్ తినవచ్చు. ఇది అద్భుతమైన ప్రోటీన్లను అందిస్తుంది. అలాగే రాత్రి పూట ఆహారంలో చేపలను తింటున్నా మేలు జరుగుతుంది. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. సోయా టోఫులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించ డంతోపాటు బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. పప్పు దినుసులు, శనగలను తింటున్నా కూడా ఫలితం ఉంటుంది. వీటిల్లో ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గేలా చేస్తాయి. పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉండే కూరగాయలను రాత్రి పూట తినాల్సి ఉంటుంది. పాలకూర, బ్రోకలీ, కాలిఫ్లవర్, మొలకలు, క్యాప్సికం, పుట్ట గొడుగులు, గ్రీన్ బీన్స్ వంటి ఆహారాలను రాత్రి పూట తింటుంటే మేలు జరుగుతుంది.కినోవా, బ్రౌన్ రైస్.. సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. కినోవా, బ్రౌన్ రైస్, చిలగడదుంపలు వంటి వాటిల్లో సంక్లిమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్‌గా మారేందుకు సమయం పడుతుంది. పైగా వీటిని కాస్త తిన్నా చాలు, వీటిల్లో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను కూడా రాత్రి పూట తినవచ్చు. అవకాడో, బాదంపప్పు, వాల్ నట్స్, చియా సీడ్స్‌ను రాత్రి పూట తినవచ్చు. అలాగే ఆలివ్ ఆయిల్‌ను కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ రాత్రి పూట తీసుకోదగిన ఆహారాలు. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ కాంబినేషన్ ట్రై చేయండి.. రాత్రిపూట ఆహారంలో చేపలను, కూరగాయలను కలిపి కాంబినేషన్‌లో తినవచ్చు. లేదా చికెన్, వెజిటబుల్ సలాడ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్, వెజిటబుల్ సూప్‌ను కలిపి తీసుకోవచ్చు. సోయా టోఫు, కూరగాయలను కలిపి కూడా తినవచ్చు. ఇలా రాత్రి పూట భోజనాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను తిన్నప్పటికీ వీటిని రాత్రి పూట తక్కువ మోతాదులోనే తినాలి. ఇతర ఆహారాలతో పోలిస్తే ఇవి బరువు తగ్గేందుకు మనకు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తినకూడదు. ఇక రాత్రి పూట భోజనాన్ని వీలైనంత త్వరగా తినేయాల్సి ఉంటుంది. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 2 నుంచి 3 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. చక్కెర ఉండే ఆహారాలు, ప్రాసెస్ ఫుడ్స్, శీతల పానీయాలను తాగకూడదు. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే అధిక బరువును చాలా తేలిగ్గా తగ్గించుకోవచ్చు.

# స్పోర్ట్స్

## మాల్దీవ్స్ టు నెట్స్.. ఐపీఎల్ కోసం
# రంగంలోకి ముంబై దిగ్గజం..!

పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్(మీుశ్రీసఅఐవం)లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపీఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపీఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెఢీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు.మొన్నటి వరకూ టీ20 ప్రపంచకకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.





## ఐపీఎల్ కెరీర్‌లో మొదటి బంతికే సిక్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే ఉత్సాహానికి పర్యాయపదం. కొన్నిసార్లు ఒక జట్టు 250 పరుగులు చేస్తుంది, మరికొందరికి 70–80 పరుగులు చేయడం కూడా కష్టంగా అనిపిస్తుంది. టీ20 క్రికెట్ అనేది క్షణాల్లో మారిపోయే ఆట. ఈ లీగ్‌లో 30 బంతుల్లో సెంచరీ సాధించిన వాళ్లు ఉన్నారు. దీనిని క్రిస్ గేల్ 2013లో చేశాడు. అసాధ్యం అనిపించే అనేక రికార్డులు కూడా ఐపీఎల్‌లో ఉన్నాయి. తమ ఐపీఎల్ కెరీర్‌లోని మొదటి బంతికే సిక్స్ కొట్టిన ఆటగాళ్లు చాలా మంది ఉన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన రాబ్ క్వినీ 2009లో తన ఐపీఎల్ కెరీర్‌లోని మొదటి బంతికే సిక్స్ కొట్టాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్నప్పుడు అతను అలా చేశాడు.వాన్ కూపర్ – వెస్టిండీస్ తరఫున ఆడిన కెవాన్ కూపర్ కూడా రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్నప్పుడు తన ఐపీఎల్ కెరీర్‌లోని మొదటి బంతికే సిక్స్ కొట్టాడు. జేమ్స్ ఫాల్క్‌నర్ బౌలింగ్‌లో అతను సిక్స్ కొట్టాడు. ఆండ్రీ రస్సెల్ – 2012లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడుతున్నప్పుడు =జదీతో జరిగిన మ్యాచ్‌లో ఆండ్రీ రస్సెల్ తన కెరీర్‌లోని మొదటి బంతికే సిక్స్ కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ 2025లో సీనియర్ బౌలర్ శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టడం ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించాడు. చరిత్రలో అలా చేసిన అతి పిన్న వయస్కుడు అతను . జాబితాలో ఉన్న మరో వెస్టిండీస్ బ్యాట్స్‌మన్, కార్లోస్ బ్రాత్‌వైట్ 2016లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్) తరపున ఆడుతున్నప్పుడు తన మొదటి బంతికే సిక్స్ కొట్టాడు. జజావోన్ సియర్ల్స్ తన ఐపీఎల్ కెరీర్‌లో కేవలం నాలుగు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 2018లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తన మొదటి బంతికే సిక్స్ కొట్టాడు. శ్రీలంక స్పిన్నర్ 2022లో =జదీపై అరంగేట్రం చేశాడు. హర్షల్ పటేల్‌ను ఎదుర్కొంటూ తన కెరీర్‌లోని మొదటి బంతికే సిక్స్ కొట్టాడు. ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన సిద్ధేష్ లాడ్ తన ఐపీఎల్ కెరీర్‌లో ఒకే ఒక్క మ్యాచ్ ఆడాడు. 2019లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదటి బంతికే సిక్స్ కొట్టాడు.



## సత్తా చాటేందుకు సన్ రైజర్స్ సిద్ధం..



వేదిక ఏదైనా సరే... ఓపెనర్లు బరిలోకి దిగితే చాలు... బౌండరీల మోత... సిక్సర్ల వర్షం... అమాంతంగా స్కోరు బోర్డు పరుగులు పెడుతుంది. ఎవరికీ సాధ్యకాని రికార్డుల్ని తిరగరాసే సన్ రైజర్స్ హైదరాబాద్... తాజా సీజన్లో ప్రత్యర్థులకు చుక్కలు చూపించేందుకు జట్టును కూడగట్టుకుంది. తిరుగులేని విజయాలతో ప్రత్యర్థి జట్లపై సత్తా చాటబోతోంది.టీ20 వరల్డ్ కప్ పోటీల్లో భీకర బ్యాటింగ్ శైలితో ఆకట్టుకున్న ఇషాన్ కిషన్, వైబ్రేటింగ్ బ్యాటింగ్ కి మారుపేరుగా నిలిచిన అభిషేక్ శర్మ బ్యాటింగ్ శైలితో క్రికెట్ స్టేడియాలను షేక్ చేయాలని ఎదురుచూస్తున్నారు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చివరిదాకా ఒకటే పంథాతో అత్యధిక పరుగులు రాబట్టాలనే ఆలోచనతో బ్యాట్స్ మెన్లు మానసిక సంసిద్ధతతో బరిలో దిగి సత్తా చాటాలని ఎదురుచూస్తున్నారు. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ ప్యాట్ కమిన్స్ సారథ్యంలో సన్ రైజర్స్ జట్టు సత్తా చాటేందుకు సిద్ధమైంది. డెక్కన్ ఛార్జస్ హైదరాబాద్ గా ఉన్న ఐపీఎల్ టీమ్ కాలక్రమంలో సన్ రైజర్స్ హైదరాబాద్ గా పేరు మార్చుకుంది. 18 సీజన్లలోనూ... అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిన సన్ రైజర్స్... ప్రతిభావంతమైన జట్టుగా ఎదిగింది. డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో ప్రత్యర్థి జట్లపై మెరుగైన ప్రదర్శన చేసి.. ఐపీఎల్ 2016 సీజన్ ట్రోఫీని చేజిక్కించుకుంది. 2018, 2024 సీజన్లలో ఫైనల్ చేరుకుని పరాజయాన్ని చవిచూసింది. సన్ రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెన్ను గాయంతో ఉన్నాడు. దీంతో కమిన్స్ టి20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ఆరంభమయ్యేలోపు అతడు పూర్తిగా కోలుకునే అవకాశాలున్నాయి. లేకుంటే కమిన్స్ స్థానంలో కొత్త సారథి సన్ రైజర్స్ హైదరాబాద్‌ను లీడ్ చేసే అవకాశం ఉంది. కెప్టెన్సీ రేసులో ముగ్గురు ప్లేయర్ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్‌లు కెప్టెన్సీ రేసులో ఉన్నారు. ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా ఐపీఎల్ 2026కు దూరమైతే.. ఈ ముగ్గురిలో ఒకరు కెప్టెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇషాన్ కిషన్‌కు సారథ్య బాధ్యతలు అప్పజెప్పే అవకాశం ఉందని తెలుస్తోంది. గతేడాది ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ ట్రోఫీ సాధించాడు. 2016లో జరిగిన అండర్ 19 ప్రపంచకప్‌లో టీమిండియా కెప్టెన్‌గా ఉన్నాడు. అప్పుడు భారత జట్టును విశ్వవిజేతగా నిలిపాడు. కమిన్స్ ఐపీఎల్ 2026కు దూరమైతే సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీకి ఇషాన్ కిషన్ సరైనోడనే సంకేతాలున్నాయి. ఓపెనింగ్ బ్యాట్స్ మెన్లుగా అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ క్రీజులోకి దిగితే చాలు... వీర విహారం చేస్తారు. పరుగుల వరద పారించడమే లక్ష్యంగా సాగే ఆట... క్రికెట్ అభిమానులకు కనువిందుచేస్తుంది. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ ఆటతీరుతో ప్రత్యర్థి జట్లు బెంబేలెత్తిపోతాయి. ప్రతి ఓవర్లోనూ బౌండరీల మోత... సిక్సర్ల హోరుతో ఇటు అభిషేక్ శర్మ... అటు ట్రావిస్ హెడ్ చెలరేగిపోతారు. దీంతో తక్కువ బంతుల్లో ఎక్కువ పరుగులు సాధించే రికార్డులు సన్ రైజర్స్ హైదరాబాద్ సొంతమనే దిశగా ఆట సాగించారు. ఇప్పటిదాకా సాగిన ఐపీఎల్ సీజన్లలో టాప్ 5 స్కోర్లలో తొలి నాలుగు స్థానాలను సన్ రైజర్స్ హైదరాబాద్ సొంతంచేసుకుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు స్కోరు రికార్డును అదే జట్టు ఆటగాళ్లే బ్రేక్ చేశారు. తిరగ రాశారు. 2024 సీజన్ లో విశ్వరూపాన్ని ప్రదర్శించిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ ఆల్ టైమ్ హైస్కోరు రికార్డును నమోదు చేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై 287 పరుగులు సాధించింది. ఈ స్కోరు ఇపుడు టాప్ రికార్డ్ గా ఉంది. అదే సీజన్లో ముంబై ఇండియన్స్ జట్టుపై 277 పరుగులు చేసింది. అలాగే పంజాబ్ కింగ్స్ జట్టుపై 266 పరుగులు నమోదు చేసింది. ఈ స్థాయి స్కోర్లు చేసిన జట్టు ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ మాత్రమేనని రికార్డు సృష్టించింది. ఈ సీజన్లో బ్యాటింగ్ పరంగా... కనువిందు చేయబోతున్నాయి. ఆ తర్వాత బరిలోకి దిగే ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ రెడ్డి, కామిందు మెండిస్, లియాం లివింగ్ స్టోన్, జాక్ ఎడ్వర్డ్, అద్భుతమైన బ్యాటింగ్ శైలితో స్కోరు బోర్డులను పరుగులు పెట్టించబోతున్నారు. ఈ సీజన్ లోనూ సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాట్స్ మెన్లు సరికొత్త రికార్డు నమోదు చేయాలనే సంకల్పంతో ఉన్నారు. మెరుగైన ప్రదర్శనతో సాధికార విజయాలు సాధించి... ట్రోఫీ చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో హైదరాబాద్ జట్టు సన్నాహాలు చేస్తోంది. పరుగుల సాధనలో హార్డ్ హిట్టర్లు, ఆల్ రౌండర్లు రికార్డులు నమోదు చేస్తున్నారు... బౌలింగ్ దళంలోనూ... ప్రత్యర్థి జట్టును ఆటకట్టించే వ్యూహాలతో సరికొత్త రికార్డులపై కన్నేసిందని చెప్పొచ్చు. కెప్టెన్ కమిన్స్, జీషన్ అన్సారీ, జయదేవ్ ఉనద్కత్, ఈషన్ మలింగా చక్కటి బంతులు సంధించి.. ప్రత్యర్థి జట్లను ఆటకట్టించ బోతున్నారు. టీ20 వరల్డ్ కప్ పోటీల్లో సాగిన విన్యాసాలు... ఇండియన్ ప్రీమియర్ లీగ్ లోనూ కనిపించ బోతున్నాయి. పరుగుల సాధనలో బ్యాట్స్ మెన్లు పోటీ పడుతారా? వికెట్ల సాధనలో బౌలర్లు పైచేయి సాధిస్తారా? అని ఈ సీజన్లో క్రికెట్ అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



## బుమ్రా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టీ20 ప్లేయర్

### సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్

టీ20 క్రికెట్ చరిత్రలో ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడు ఎవరనే చర్చకు సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ ఆసక్తికర సమాధానమిచ్చాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టీ20 ప్లేయర్ అని తెలిపాడు. కొత్త బంతి అయినా.. పాత బంతి అయినా చివరకు సూపర్ ఓవర్ అయినా.. బుమ్రా చేతికి బంతి ఇస్తే మ్యాచ్‌ను గెలిపిస్తాడని వివరణ ఇచ్చాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వికెట్లు తీయగల సామర్థ్యం అతనికి ఉందని కొనియాడాడు. అయితే తనకు బౌలింగ్ చేయనంత వరకే బుమ్రా గ్రేటెస్ట్ బౌలర్ అని చమత్కరించాడు. తనతో పాటు విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్ వంటి దిగ్గజ బ్యాటర్ల పేర్లు చెప్పకుండా.. డివిలియర్స్ ఒక బౌలర్‌ను ఎంచుకోవడం విశేషం. 2013 మార్చిలో టీ20ల్లోకి అరంగేట్రం చేసిన బుమ్రా.. 270 మ్యాచ్‌లు ఆడి 345 వికెట్లు తీసాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున 95 మ్యాచ్‌ల్లో 121 తీసాడు. టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున 145 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు తీసాడు. ముంబై తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు పాకిస్థాన్ మాజీ పేసర్ ఆకిబ్ జావేద్..జస్‌ప్రీత్ బుమ్రాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. బుమ్రా విలక్షణమైన బౌలింగ్ యాక్షన్‌తోనే బ్యాటర్లకు లయ దొరకదని చెప్పిన ఆకిబ్ జావేద్.. అతన్ని మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్‌తో పోల్చాడు. 'ఫాస్ట్ బౌలింగ్‌లో బుమ్రా ఒక ఉస్మాన్ తారిఖ్ లాంటివాడు'అని అభివర్ణించాడు. అయితే ఈ పోలికపై భారత క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. ప్రపంచ స్థాయి పేసర్‌ను ఒక సాధారణ స్పిన్నర్‌తో పోల్చడమేంటని నెటిజన్లు మండిపడుతున్నారు.

## సన్‌రైజర్స్ అభిమానులకు బంపరాఫర్..

ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ఒక అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. సన్‌రైజర్స్ తారలను అత్యంత దగ్గరగా కలుసుకునేందుకు 'మీట్ ద రైజర్స్' పేరుతో ఒక ప్రత్యేకమైన ఈవెంట్‌ను నిర్వాహకులు ప్లాన్ చేశారు. ఈ భారీ కార్యక్రమం మార్చి 22న హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా జరగనుంది. ఈ విషయాన్ని టీమ్ మేనేజ్మెంట్ అధికారిక సోషల్ మీడియా పేజీ ద్వారా వెల్లడించారు. ఎప్పుడూ టీవీల్లో లేదా స్టేడియం స్టాండ్స్‌లో చూసే తమ అభిమాన ఆటగాళ్లతో ముఖాముఖి మాట్లాడేందుకు ఈ మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్ ఒక అరుదైన వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నప్పటికీ, కేవలం 1000 మంది అదృష్టవంతులైన అభిమానులకు మాత్రమే ఇందులో పాల్గొనే అద్భుత అవకాశం దక్కుతుంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న మొదటి వెయ్యి మందికి ఈ ఉచిత పాస్‌లు లభిస్తాయి. ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ అంతా ఈ అద్భుత క్షణాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ అరుదైన ఈవెంట్ కోసం టికెట్లను బుక్ చేసుకోవడం చాలా సులభం. అభిమానులు ముందుగా ఆపిల్ యాప్ స్టోర్ లేదా గూగుల్ ప్లే స్టోర్ నుంచి జొమాటోకు చెందిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత వివరాలతో లాగిన్ లేదా సైన్ అప్ పూర్తి చేసి సిద్ధంగా ఉండాలి. (మార్చి 18న) ఉదయం సరిగ్గా 11:30 గంటలకు టికెట్ల బుకింగ్ ప్రారంభం అవుతుంది. సన్‌రైజర్స్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో రేపు ఉదయం పోస్ట్ చేసే ప్రత్యేక లింక్‌పై క్లిక్ చేసి, యాప్‌లో సూచించిన విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి. ఇక్కడ గమనించాల్సిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఒక్కో వ్యక్తికి కేవలం ఒక టికెట్ మాత్రమే కేటాయిస్తారు. పరిమిత సంఖ్యలో పాస్‌లు అందుబాటులో ఉన్నందున, బుకింగ్ ఓపెన్ అయిన వెంటనే త్వరపడి టికెట్‌ను దక్కించుకోవాలి.


## కేకేఆర్ ఫ్రాంచైజీతో నాది విడదీయని బంధం

### టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్

కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) ఫ్రాంచైజీతో తనది విడదీయని బంధమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. కేకేఆర్‌తో తనకు అదృష్టమని, కెప్టెన్‌గా, కోచ్‌గా తనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టిందన్నాడు. అసలు తాను టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ప్రధాన కారణం కేకేఆర్ అని గంభీర్ స్పష్టం చేశాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ కీలక పాత్ర పోషించాడు. టీమ్ సెలెక్షన్ నుంచి మైదానంలో అమలు చేసే వ్యూహాల వరకు అన్నీ తానై నడిపించాడు. దాంతో ఆటగాడిగా.. కోచ్‌గా టీ20 ప్రపంచకప్ గెలిచిన ఘనతను అందుకున్నాడు. అంతేకాకుండా భారత జట్టుకు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించిన ఏకైక కోచ్‌గా గంభీర్ చరిత్రకెక్కాడు.తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంలో కేకేఆర్ ఫ్రాంచైజీది కీలక పాత్ర అని గంభీర్ తెలిపాడు.' 7–8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నేను కోల్‌కతా జట్టు మెంటార్‌గా బాధ్యతలు చేపట్టాను. ఆ సీజన్‌లో కేకేఆర్ మెరుగైన ప్రదర్శన చేసి విజేతగా నిలవడంతో అప్పటి బీసీసీఐ సెక్రటరీ జై షా టీమిండియా హెడ్ కోచ్ పదవిని ఆఫర్ చేశాడు. అయితే గతంలో నాకు హెడ్ కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. దాంతో మొదట్లో సంకోచించాను. మెంటార్‌గా ఉండటానికి, హెడ్ కోచ్‌గా ఉండటానికి చాలా తేడా ఉంటుంది. అయినప్పటికీ భారత క్రికెట్‌పై నాకు ఉన్న అనుబంధం కారణంగా ఈ సవాల్‌ను స్వీకరించేందుకు అంగీకరించాను. ఐపీఎల్ 2024 సీజన్‌లో నేను కేకేఆర్ మెంటార్‌గా బాధ్యతలు చేపట్టకపోయినా.. ఆ జట్టు టైటిల్ గెలవకపోయినా ఈ రోజు నేను టీమిండియా హెడ్ కోచ్‌గా ఉండేవాడిని కాదు. నా ఎదుగుదలకు కోల్‌కతానే ఒక ప్రధాన కారణం. కెప్టెన్‌గా.. ఇప్పుడు కోచ్‌గా కూడా కోల్‌కతా నాకు ఎప్పుడూ అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఆ జట్టుతో.. ఆ నగరంతో నాకు ఒక ప్రత్యేకమైన బంధం ఉంది.



# విశ్వేజి



## ఇంటర్వెల్ వాకింగ్

జపాన్‌వాసులు ఏది చేసినా పద్ధతిగానే ఉంటుంది. టెక్నాలజీ, ఆహారం, క్రమశిక్షణ.. ఇలా ఏ విషయం తీసుకున్నా ప్రత్యేకంగానే నిలుస్తుంది. ఇప్పుడు వాకింగ్‌లోనూ.. మరో కింగ్‌లాంటి పద్ధతిని తీసుకొచ్చారు. అదే.. ఇంటర్వెల్ వాకింగ్. మామూలు నడకతో పోలిస్తే.. ఈ ఇంటర్వెల్ వాకింగ్ ద్వారా మరిన్ని అదనపు ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. వేగాన్ని మార్చుకుంటూ నడక సాగించడమే ఇంటర్వెల్ వాకింగ్ పద్ధతి. మొదటగా వాచ్ లేదా ఫోన్‌లో మూడు నిమిషాల వ్యవధితో టైమర్‌ను సెట్ చేసుకోవాలి. నడకను ప్రారంభించి.. మొదటి మూడు నిమిషాలపాటు నెమ్మదిగా కొనసాగించాలి. ఆ తర్వాతి మూడు నిమిషాలు వేగంగా నడవాలి. మళ్లీ మూడు నిమిషాలు వేగాన్ని తగ్గించాలి. ఇలా 30 నిమిషాల పాటు వేగాన్ని తగ్గిస్తూ. పెంచుతూ నడక సాగించాలి. అనేక ప్రయోజనాలు.. ఇప్పటివరకు రోజుకు 10వేల అడుగులు వేయడమే నడకలో ఉత్తమమైన వ్యాయామంగా గుర్తింపు పొందింది. అయితే, ఎన్ని అడుగులు వేయాలన్న విషయాన్ని పక్కన పెడితే.. జపాన్‌వాసులు ఫాలో అవుతున్న ఇంటర్వెల్ వాకింగ్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. మూడు నెలలపాటు వారానికి మూడుసార్లు.. 30 నిమిషాల ఇంటర్వెల్ వాకింగ్ చేసిన వారిలో రక్తపోటు, కొలెస్ట్రాల్ తగ్గినట్లు గుర్తించారు. వారి కాళ్లలో బలం పెరిగిందనీ, మామూలు వాకింగ్ చేసేవారితో పోలిస్తే వీరిలో ఏరోబిక్ సామర్థ్యం పెరిగినట్లు తేల్చారు. అంతేకాకుండా.. ఇంటర్వెల్ వాకింగ్‌లో ఎక్కువ కేలరీలు ఖర్చయ్యే అవకాశం ఉంది. వేగంగా నడిచే సమయంలో హృదయ స్పందన రేటు పెరుగుతుంది. దాంతో గుండె ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది.

## ఇవి తీసుకోండి... గ్రద్ద లాంటి కంటి చూపు మీ సొంతమవుతుంది!

కంటిచూపు మెరుగుపడటానికి, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా కొన్ని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఆరోగ్యానికి అవసరం. కంటి చూపు మెరుగుపడటానికి పోషకాహారం తీసుకోవాలి. విటమిన్ ఎ అధికంగా ఉండేవి: కంటి ఆరోగ్యానికి విటమిన్ ఎ అత్యంత ముఖ్యమైనది. ఇది రాత్రి దృష్టిని మెరుగుపరచడంతోపాటు కళ్లు పొడిబారడాన్ని నివారిస్తుంది. క్యారెట్లు: బీటా–కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. చిలగడదుంపలు: క్యారెట్ల మాదిరిగానే వీటిలో కూడా బీటా–కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఆకుకూరలు: పాలకూర, కాలే, తోటకూర, బచ్చలికూర వంటి ముదురు ఆకుపచ్చ కూరగాయలు తీసుకోవాలి. విటమిన్ ఏ కు మంచి వనరైన గుమ్మడికాయను కూడా తీసుకుంటుండాలి. గుడ్డు పచ్చ సొన, మామిడి, బొప్పాయిల్లో కూడా బీటా కెరోటిన్ ఉంటుంది. ల్యూటిన్, జియాక్సంతిన్: ఈ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కంటి రెటీనాలోని మక్యులా లో ఉంటాయి. ఇవి హానికరమైన నీలి కాంతిని ఫిల్టర్ చేసి, వయస్సు సంబంధిత మక్యులర్ డీజెనరేషన్, కంటిశుక్లం నుండి కంటిని రక్షిస్తాయి. ఆకుకూరలు: పాలకూర, కాలే, బచ్చలికూర తీసుకోవాలి. విటమిన్ సి : ఇది ఒక యాంటీఆక్సిడెంట్, ఇది కంటి రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది, కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. సిట్రస్ పండ్లు: నారింజ, నిమ్మ, బత్తాయి, ద్రాక్షపండ్లు తీసుకోవాలి. అలాగే ఉసిరికాయ, స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీలు తరుచుగా తీసుకోవాలి. విటమిన్ ఇ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది కంటి కణాలను ఆక్సీకరణ నష్టం నుండి రక్షించి, కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నట్స్, బాదం, వాల్‌నట్‌లు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు తినాలి.

# వేధింపులపై ఏఐ గురి



అన్నిరంగాల్లో తనదైన ముద్రవేస్తున్న కృత్రిమ మేధ.. మహిళలకూ అండగా నిలుస్తున్నది. కార్యాలయాల్లో వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తున్నది. సమస్యను గుర్తించడం, నిరోధించడంతోపాటు పరిష్కరించడంలోనూ సాయపడుతున్నది. ఏళ్లకేళ్లుగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కార్యాలయాల్లో మహిళలపై వేధింపులు తగ్గడం లేదు. కౌన్సెలింగ్‌లు, శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ.. 'వేధింపులు' నిరంతర సమస్యగా కొనసాగుతున్నాయి. అయితే, ఈ విషయంలో బాధితుల్లో చాలామంది మౌనంగానే ఉండిపోతున్నారు. పరువు పోతుందనీ, కెరీర్ ఇబ్బందిలో పడుతుందని ఫిర్యాదులు చేయడానికి భయపడుతున్నారు. ధైర్యంగా ఫిర్యాదు చేసినా.. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉండటం లేదు. ఈ సమస్యకు.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మంచి పరిష్కారం చూపుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో నెమ్మదిగా, పక్షపాతంగా సాగే మానవ జోక్యంపై ఆధారపడటానికి బదులుగా.. 'ఏఐ'తో తక్షణ న్యాయం పొందొచ్చని అంటున్నారు. ఇప్పటికే ఉమ్‌వెల్ట్.ఏఐ రూపొందించిన ఏఐ ఆధారిత 'చీఫ్ లైజనింగ్ ఆఫీసర్' నిక్కీ.. కార్యాలయాల్లో వేధింపులపై నివేదికలు రూపొందిస్తున్నది. ఉద్యోగుల మనోభావాలను విశ్లేషించడంతోపాటు మహిళల అభిప్రాయాలనూ సేకరిస్తుంది. ఈ మెయిల్స్ చెక్ చేయడం, చాట్ సెషన్లను స్కాన్ చేయడం ద్వారా.. ఎవరైనా వేధింపులకు గురవుతున్నారా అని గుర్తిస్తుంది. వేధింపుల కేసుల్లోని అతిపెద్ద సమస్యలు.. రిపోర్టింగ్, పక్షపాతం. చాలాచోట్ల ఉన్నతోద్యోగులు తనవాళ్లకు అండగా నిలుస్తుంటారు. కానీ, ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్.. ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారిస్తుంది. లింగం, విభాగం, సీనియారిటీ లాంటి గుర్తింపులను తొలగిస్తుంది. కేసులను వాస్తవాల ఆధారంగా సమీక్షిస్తుంది. తద్వారా బాధితులకు న్యాయం జరుగుతుంది. ప్రతీకార భయంతో వేధింపులపై ఫిర్యాదు చేయడానికి చాలామంది ముందుకు రావడంలేదు. అయితే, ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్లు.. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతాయి. బాధితులకు కావాల్సిన చట్టపరమైన సలహాలను అందిస్తాయి. వారి మానసిక స్థితి మెరుగుపడేందుకు కావాల్సిన కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తాయి. మరికొన్ని ఆధునిక ఏఐ వ్యవస్థలు.. ఉద్యోగుల్లో అనుచిత ప్రవర్తననూ గుర్తిస్తున్నాయి. ఇబ్బందికరంగా ప్రవర్తించేవారిపై ఓ కన్నేసి ఉంచుతున్నాయి. అలాంటివారిపై ఫిర్యాదులు అందితే.. తక్షణమే తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నాయి.

## మునక్కాయల ఆరోగ్య అద్భుతాలు చూస్తే వదిలిపెట్టరు!




మన ప్రకృతిలో ఆరోగ్యానికి దోహదం చేసే ఎన్నో కూరగాయలు ఉన్నాయి. కూరగాయలలో మునక్కాయలు ఒకటి . మునక్కాయల తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మునక్కాయలలో ఉండే పోషకాలు మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి. మునక్కాయల లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, ఫాస్ఫరస్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శక్తిని ఇవ్వడంతోపాటు మనం ఆరోగ్యంగా ఉండడానికి దోహదం చేస్తాయి. పాల ప్యాకెట్లపై పవన్ హరిహర వీరమల్లు ప్రచారం..! విజయ మిల్క్ క్లారిటీ..! నాలుగు రోజులు భారీ వర్షాలు – ఈ జిల్లాలకు తాజా హెచ్చరిక..!! 'వలపు వల'తో రూ.102 కోట్లు స్వాహా.. 80 వేల ఫోటోలు, వీడియోలు..సన్యాసులే టార్గెట్..! డయాబెటిస్, హై బీపీ కంట్రోల్ చేయటానికి మునక్కాయలు మునక్కాయ లతో డయాబెటిస్ కు చెక్ పెట్టవచ్చు. మునక్కాయల లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేయడానికి దోహదం చేస్తాయి. మునక్కాయ లతో హైబీపీని కంట్రోల్ చేసుకోవచ్చు. ఇందులో ఉండే పొటాషియం అధిక రక్తపోటును నివారించడానికి దోహదం చేస్తుంది. మునక్కాయల లో ఉండే క్యాల్షియం, ఫాస్ఫరస్ వల్ల ఎముకలకు బలం చేకూరుతుంది. మునక్కాయల లో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణక్రియకు దోహదం చేస్తుంది.గుండె జబ్బులు, చర్మ ఆరోగ్యానికి రక్షణ మునక్కాయలు మునక్కాయలు మన శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు కావలసిన శక్తిని అందిస్తాయి. మునక్కాయలు తినడం వల్ల ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత వ్యాధులను నివారించడానికి దోహదం చేస్తాయి. మునక్కాయలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. మునక్కాయలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మం యంగ్ గా ఉండేలా చేస్తాయి. మునక్కాయలతో కాలేయ, పేగుల ఆరోగ్యం మునక్కాయలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదం చేస్తాయి. అలసటను తగ్గించి శరీరానికి కావలసిన శక్తిని ఇస్తాయి. మునక్కాయలు పేగుల ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. వాపులు, ఇన్ఫెక్షన్లు, గాయాలు వంటి వాటిని తగ్గించడానికి దోహదం చేస్తాయి. మంచి కంటి చూపును అందిస్తాయి. అంతేకాదు మునక్కాయలు తరచూ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల పురుషులలో లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. 650 మందికి మర్చిపోలేని సాయం చేసిన స్టార్ హీరో..! రోజా కోసం రంగంలోకి శ్యామల.. పవన్ కళ్యాణ్ కు సంచలన డిమాండ్! 'నిధి' పాప బంగారం.. ఒక్క రోజులోనే 15కి పైగా ఇంటర్వ్యూలు ! %ూశ్రీంశీ =ఘు౧% అతిగా నిద్రిస్తున్నారా? అయితే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే మునక్కాయలు ఇలా తింటే మంచిది మునక్కాయలు తినటంతో శారీరక అనారోగం గణనీయంగా తగ్గుతుంది .. ఇన్ని గొప్ప లక్షణాలు ఉన్న మునక్కాయలను అతిగా తినకుండా, అప్పుడప్పుడు ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది. ఇన్ని అద్భుత పోషకాల ములక్కాయలను వివిధ రకాల కూరగాలతో కూడా కలిపి వండుకోవచ్చు.

# మార్కెట్

## యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలో కొత్త సపోర్ట్ చాట్ ఫీచర్‌ను తీసుకురానున్న వాట్సాప్..!

ఐఓఎస్ యూజర్లకు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పెషల్ సపోర్ట్ చాట్ ద్వారా ఏఐ యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నది. ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ యాప్ తాజా వెర్షన్‌లోకి రాగా.. రాబోయే వారాల్లో మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ సపోర్ట్ చాట్ కోసం మొదట వాట్సాప్ సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో హెల్ప్ బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో హెల్ప్‌సెంటర్ బటన్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్ అస్ పై క్లిక్ చేసి యాక్సెస్ చేయొచ్చు. దాంతో యూజర్లు అధికారిక వాట్సాప్ సపోర్ట్ ఖాతా అని సూచించే మెటా వేరిఫైడ్ బ్లూ టిక్‌తో కొత్త చాట్ విండో ఓపెన్ అవుతుంది.



## వేగంగా విస్తరిస్తున్న భారత ఈవీ కార్ల మార్కెట్..



2028 నాటికి 7శాతం దాటనున్న వాటా..! భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నది. సరఫరా గొలుసులోని, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌కు సంబంధించిన సమస్యలు సకాలంలో పరిష్కరించగలిగితే 2028 ఆర్థిక సంవత్సరానికి భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7శాతాన్ని దాటుతుందని ఓ నివేదిక పేర్కొంది. అమెరికన్ ఈవీ కంపెనీ టెస్లా భారత్లోకి ప్రవేశించినట్లు అధికారికంగా ప్రకటించిన కేర్ ఏజ్ అడ్వైజరీ ఈ నివేదికను విడుదల చేసింది. గత కొద్దిరోజులుగా భారత్‌లోని ఎలక్ట్రికల్ కార్ల అమ్మకాల్లో విపరీతంగా పెరుగుతున్నది. నివేదిక ప్రకారం.. 2021 ఆర్థిక సంవత్సరంలో 5వేల యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య 1.07లక్షలు దాటింది. అయితే, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలకే ఇప్పటికీ ఈవీ మార్కెట్‌లో పెద్ద వాటా ఉన్నది. పరిశ్రమకు లభిస్తున్న మద్దు కారణంగా ఫోర్ వీలర్స్ విభాగం సైతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ సమస్యలు పరిష్కరించగలిగితే భారత్‌లో ఈవీ అమ్మకాలు 2028 ఆర్థిక సంవత్సరానికి 7శాతం దాటే అవకాశం ఉంటుందని కేర్‌ఏజ్ సీనియర్ డైరెక్టర్ తన్వి షా పేర్కొన్నారు. కొత్త మోడల్స్, చార్జింగ్ మౌలిక సదుపాయాల పెరుగుదల, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం కింద బ్యాటరీ స్థానికీకరణ కారణంగా భారత్‌లో ఈవీ రంగానికి గొప్ప అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఫేమ్–3, అధునాతన బ్యాటరీల కోసం పీఎల్ఐ పథకం, బ్యాటరీ ముఖ్యమైన ఖనిజాలపై కస్టమ్ సుంకం మినహాయింపు వంటి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా సరఫరాలో గొలుసు బలోపేతమయ్యేందుకు, ఖర్చులు తగ్గించేందు సహాయపడనున్నాయి. ఈవీలు ఎదుర్కొంటున్న పెద్ద సవాల్ పబ్లిక్ చార్జింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడం. ప్రస్తుతం చార్జింగ్ మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి. 2022 నాటికి భారత్‌లో 5,151 పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఉండగా.. 2025 ప్రారంభానికి ఈ సంఖ్య 26వేలు దాటింది. ఈ వృద్ధి రేటు ఏటా 72 శాతానికి పైగా ఉంది. మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలు ప్రోత్సాహకాలు (భూమి, సబ్సిడీ) ఇస్తున్నాయి. అలాగే, మున్సిపల్ కార్పొరేషన్లు ఇప్పుడు నివాస, వాణిజ్య ప్రాజెక్టుల్లోనూ ఈవీ పార్కింగ్స్‌ను తప్పనిసరి చేస్తున్నాయి. దాంతో వాహనదారుల ఆందోళనలు కొంత వరకు తగ్గుతున్నాయి. ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు (%జూాం%) సైతం తమ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తున్నారు. ప్రభుత్వాలు, పలు సంస్థల భాగస్వామ్యంతో ముందుకెళ్తున్నారు. అదే సమయంలో బీఈఈ, నీతి ఆయోగ్ వంటి జాతీయ సంస్థలు ఛార్జర్ స్టాండర్డైజేషన్, ఇంటర్‌ఆపరేబిలిటీపై పనిచేస్తున్నాయి. తద్వారా ఛార్జింగ్ ఎక్స్‌ప్రీరియన్స్ సులభం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ఈవీ బ్యాటరీలకు అవసరమైన 16 ఖనిజాలపై ప్రైమరీ కస్టమ్ సుంకాన్ని తొలగించింది. దాంతో ఖర్చులు మరింత తగ్గనున్నాయి. దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యం పెరుగనున్నది. నివేదిక ప్రకారం.. 2022 ఆర్థిక సంవత్సరంలో భారత్ 100 శాతం లిథియం అయాన్ సెల్ దిగుమతులపై ఆధారపడి ఉండగా.. 20227 నాటికి ఇది 20శాతానికి పడిపోయే అవకాశం ఉంది. ఎందుకంటే దేశంలో బ్యాటరీ తయారీలో పెద్ద పెట్టుబడులు పెడుతున్నారు. ప్రభుత్వ విధానాలు, సాంకేతిక పురోగతి, టెస్లా వంటి టాప్ కంపెనీల ప్రవేశంతో భారతదేశ ఈవీ మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.



## కెడిట్ కార్డులపైనే ఆధారం..

దేశంలో అల్పాదాయ వర్గాల అవసరాలకు క్రెడిట్ కార్డులే దిక్కవుతున్నాయి. నెలకు రూ.50 వేల కంటే తక్కువ సంపాదిస్తున్న ఉద్యోగుల్లో దాదాపు 93 శాతం మంది క్రెడిట్ కార్డులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్టు తమ అధ్యయనంలో తేలిందని గ్లోబల్ ఫుల్–స్టక్ డాటా సైన్స్, ఏఐ ఆధారిత సంస్థ థింక్360.ఏఐ మంగళవారం తెలియజేసింది. గడిచిన ఏడాదికిపైగా కాలంలో 20 వేలకుపైగా ఉద్యోగులు, స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న వ్యక్తుల జీవన శైలి, ఆర్థిక అవసరాలు, అభిప్రాయాల ఆధారంగా ఈ అధ్యయనం రూపొందించినట్టు పేర్కొన్నది. ఈ సందర్భంగా స్వయం ఉపాధితో జీవిస్తున్న 85 శాతం మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు.

# ఆంధ్రప్రదేశ్

## అరటి ఎగుమతులు ఢమాల్

**దేశయంగా ముందుకు రాని కొనుగోలుదారులు**

**ఆందోళనలో జిల్లా అరటి రైతులు**

అనంతపురం,మార్చి17 : పశ్చిమ దేశాల్లో కొనసాగుతున్న యుద్ధంతో అరటి రైతులు కుదేలవుతున్నారు. ఎగుములు ఆగి, ధరలు పడిపోవడంతో పలు చోట్ల అరటి రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. 20 రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పడిపోయింది. కిలో రూ.5కు కూడా కొనే నాథుడు కరువవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి సాగు గణనీయంగా ఉంది. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు 47 వేల ఎకరాల్లో ఈ ఏడాది అరటి సాగైంది. ఫిబ్రవరిలో కిలో రూ.22 నుంచి రూ.24 వరకు ధర పలికింది. వారం రోజులుగా అరటిపై యుద్ధం నీడలు కమ్ముకోవడంతో ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతదో తోటల్లోనే అరటి కాయలు వాడిపోతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగు, కోత కూలి కలుపుకొని సుమారు రూ.1.40 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు లక్ష రూపాయలు మాత్రమే వచ్చే అవకాశముంది. అది కూడా మొదటి పంట అయితేనే ఈ ధర వస్తుంది. పంట కొనుగోలుకు వ్యాపారి వస్తేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే ఎండ తీవ్రతకు నెల రోజుల్లో గెలలు నేలకొరిగే ప్రమాదం ఉంది. రెండు, మూడో ఏడాది పంటను అడిగేవారు కరువయ్యాడు. మైక్రోసన్ అరటిని సాగు చేసిన వారి పొలాల్లో పంట కోత దశలో నాణ్యతగా ఉంది. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. వారం ముందు వరకు వ్యాపారులు టన్ను రూ.20 వేలకు అడిగారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేస్తే ధర పడిపోయిందంటూ టన్ను ఐదు వేల రూపాయలకు కూడా కొనుగోలుకు ముందుకురావడం లేదని వాపోతున్నారు. పంట కోయకపోతే గెలలు నేలకొరిగిపోయి పూర్తిగా నష్టపోతామని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఆస్తిపన్ను చెల్లింపుదారులకు శుభవార్త

**వడ్డీలో 50శాతం రాయితీ కల్పించిన ఎపి ప్రభుత్వం**

అమరావతి,మార్చి17 : మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఆస్తి పన్ను బకాయిలు పెరిగిపోయిన నేపథ్యంలో బకాయిల వసూలు కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీవో నెంబర్ 58ని విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 31 తేదీలోగా బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుంది. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించిన వారికి తదుపరి బిల్లులో ఆ మినహాయింపు మొత్తాన్ని సర్దుబాటు చేసి ఇస్తామని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు.

## రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

**మండిపడ్డ మాజీమంత్రి సాకే శైలజానాథ్**

అమరావతి,మార్చి17 : ఏపీలో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అనే రీతిలోనే ఇప్పటికీ చంద్రబాబు ఆలోచిస్తున్నారంటూ దుయ్యబట్టారు. సగటున రోజుకు 8 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభమే ఈ ఆత్మహత్యలకు కారణం. విపత్తులు వచ్చినా ప్రభుత్వం మాటలు తప్ప.. లబ్ధి చేకూర్చడం లేదు. ఎన్నికల ముందు రైతులకు, రైతు కూలీలకు అనేక హామీలు ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొర మినహా ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేవని అన్నారు. మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా ధరల స్థిరీకరణ నిధికి రూ.3,000 కోట్లు కూడా కేటాయించలేదు. వైఎస్సార్, జగన్ పరిపాలనలో రైతే రాజు అన్నట్లుగా పరిస్థితులు ఉండేవి. క్రాప్ ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించక రైతులు విపత్తులతో నష్టపోయారు. అన్నంపెట్టే రైతుల సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం వెంటనే స్పందించాలి. చిన్న, సన్నకారు రైతాంగాన్ని ఆదుకోవాలి' అని సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు.

## చెత్త తరలింపులో డంప్ యార్డ్‌కు స్వస్తి

**విశాఖలో నేరుగా ఎనర్జీ ప్లాంట్‌కు చెత్త**

**గాజువాక పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి**

విశాఖపట్నం,మార్చి17 : విశాఖ నగరంలో డంపింగ్ యార్డు అవసరం లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గాజువాకలో 4.75 ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో పార్క్‌ను ప్రారంభించామని చెప్పారు. గత ప్రభుత్వం మున్సిపల్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. మున్సిపాలిటీల్లో ప్రజలు కట్టిన పన్నులను ఇతర అవసరాలకు మళ్లించేసిందన్నారు. గాజువాకలో మంత్రి నారాయణ మంగళవారం ఉదయం పర్యటించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గాజువాక జోన్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. అలాగే 76వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో అల్లూరి సీతారామరాజు పార్క్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పక్కదారి పట్టించిన 1700 కోట్ల రూపాయల నిధులు ఇంకా మున్సిపాలిటీలకు రాలేదని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీల నిధులు అక్కడే ఖర్చు చేసేలా గ్రీన్ ఛానల్ తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ.14 వేల కోట్లతో టెండర్లు పిలిచామని చెప్పారు. రాబోయే రెండేళ్లలో మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. రూ.5000 కోట్లతో పలు నగరాల్లో పక్కా డ్రెయిన్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే మరో రూ.4000 కోట్లతో తాగునీరు, డ్రెయిన్లు, రోడ్లు, లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మిషన్ మోడ్‌లో మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేలా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌పై రైట్స్ సంస్థతో కేంద్రం సర్వే చేయిస్తోందని... నివేదిక వచ్చిన తర్వాత కేంద్రంతో మాట్లాడి ప్రాజెక్ట్ చేపడతామని మంత్రి నారాయణ వెల్లడించారు.

# గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఒక్కరిది కాదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రేమించే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిర్మించిన పార్టీ అని జగన్ పేర్కొన్నారు. పార్టీ విలువలు, విశ్వసనీయత మీదే పుట్టిందని.. అదే పునాదులపై ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. గత 16 సంవత్సరాల్లో ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశామని, గుండెధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్ జగన్ చెప్పారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేశామని తెలిపారు. మేనిఫెస్టోను కచ్చితంగా పాటిస్తూ ముందుగానే క్యాలెండర్ ప్రకటించి పథకాలను అమలు చేసినట్టు గుర్తు చేశారు. ఆర్థిక ఒత్తిళ్లు, కోవిడ్ వంటి సంక్షోభాల మధ్య కూడా పేదలు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచామన్నారు. వైసీపీ హయాంలో తీసుకున్న అప్పుల్లో పెద్ద భాగాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లోకి పంపించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. సీఎంచంద్రబాబు హామీలను నిలబెట్టుకోలేకపోయారని వైఎస్ జగన్ ఆరోపించారు. రెండేళ్లలోనే భారీ అప్పులు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని వినియోగించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ పథకాలను రద్దు చేసి ప్రజలను నిరాశపరిచారని అన్నారు. అమరావతి అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదని, దోపిడీ పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. ఈ సందర్భంగా చుండూరు రవికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలతో మరింత దగ్గరగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని జగన్ సూచించారు.

కాబట్టే ప్రజలతో కలిసి ముందుకెళ్తున్నాం. మన పాలనకు, బాబు పాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించారు. ప్రతి ఇంట్లోనూ ఇదే చర్చ జరుగుతోందన్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కేడర్‌తో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. వైఎస్ జగన్ భేటీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, పార్లమెంటు ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. అవినీతి కోసం మాత్రమే వాళ్లు అధికారంలో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. మనం అధికారంలోకి వచ్చినప్పుడు అద్భుతమైన రాష్ట్రాన్ని ఇచ్చినట్లు బాబు బిల్డప్. వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసి అప్పగించారు. కేవలంలో ఖజానాలో రూ.100కోట్లు మాత్రమే ఉంచారు. తర్వాత కోవిడ్ లాంటి కష్టాలు ఎదుర్కొన్నాం. ఆర్థికంగా ఒత్తిళ్ల మధ్య మన పరిపాలన సాగింది. ప్రజలకు ఇచ్చిన మాటను ఎప్పుడూ వదిలి పెట్టలేదు. దేశ చరిత్రలో జరగని విధంగా హామీలు అమలు చేశాం. ముందుగానే క్యాలండర్ ఇచ్చి హామీలను అమలు చేశాం. బడ్జెట్‌లో క్యాలెండర్ పెట్టి పథకాలు అమలు చేశాం. పేదలను, మధ్యతరగతి ప్రజలను ఆదుకున్నాం. మన హయాంలో రూ.3.31లక్షల కోట్లు అప్పు చేస్తే రూ.2.7లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో వేశాం. రెండేళ్లకే చంద్రబాబు కమిటెడ్ అప్పులు.. గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి. చంద్రబాబు హామీలు మోసాలుగా తేలిపాయా యని వైఎస్ జగన్ అన్నారు. 'మన పథకాలన్నీ చంద్రబాబు నాయుడు రద్దు చేశారు. ఈ డబ్బులన్నీ ఎవరి జేబులోకి వెళ్లిపోయాయి. జగన్ ఏం చేయగలిగాడు. బాబు ఎందుకు చేయలేక పోతున్నాడని చర్చిస్తున్నారు. అవినీతికి తావు లేకుండా మనం పథకాలు అమలు చేశాం. ఇప్పుడు దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇదే కొనసాగుతుందని దుయ్యబట్టారు.

రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు. అమరావతి పనుల్లో తీవ్రమైన అవినీతి. భూములను శెనక్కాయలకు, బెల్లానికి ఇచ్చేస్తున్నారు. ఏపీలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డారు. పార్లమెంటు చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ ఆయనే. ఇలాంటి వాటిపట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరు దారుణం అన్నారు. చంద్రబాబు ఒక పాలకుడిగా వ్యవహరించడం లేదు. మోసం చేశారని బాధితురాలు సీఎంకు ఫిర్యాదు చేస్తే కమిటీలు వేస్తామంటున్నారు. ఆదిమూలం మహిళపై లైంగిక దాడి చేస్తే పంచాయతీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపల్‌పై వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై నో యాక్షన్. మహిళలకు అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్ అన్నారు. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీద నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీద కూడా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా నో యాక్షన్. ఆదినారాయణరెడ్డి కొడుకు డ్రగ్స్‌తో పట్టుబడితే నో యాక్షన్. తన కొడుకు స్విమ్మింగ్? పూల్స్? వద్ద తాగుతు, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తే నో యాక్షన్ అన్నారు. తన బావమరిది మహిళలపై నీచంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని బాబు అన్నారు. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు. చంద్రబాబుకు ఇక మిగిలింది రెండేళ్లే. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికలున్నాయి. మధ్యలో నా పాదయాత్ర కూడా ఉంటుంది. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట. కార్యకర్తల ద్వారానే ప్రజలకు మరింత మంచి' అని అన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, వాటిలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు.

## రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్ నుంచి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ప్యానిక్ అవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌లను పెంచేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంచి, మెరుగైన పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷ాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్ఠంగా పెంచే అవకాశాలను పరిశీలించాలని మఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సమావేశానంతరం ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని పైరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 100 శాతం ప్రజలకు గ్యాస్ అందిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉండేవారని.. ఇప్పుడు వారు ఆరోగ్యశాఖ కిందకు మారినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉందని... వాటిని త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా ఉక్కుపాదం మోపుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.రాష్ట్రంలో గృహావసరాల కోసం ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటుగా 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 2.92 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి ఒక్కసారిగా ఎక్కువ బుకింగ్‌లు చేయడంతో సర్వర్లు జామ్ అవుతున్నాయని చెప్పారు. కేంద్ర నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాతే మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు అనుమతి ఉంటుందని గుర్తు చేశారు.బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఓటీపీ ద్వారా మాత్రమే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే 616 కేసులు నమోదు చేసి 2500 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు యాప్, ఫోన్ కాల్, వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని మంత్రి సూచించారు. ÷-రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

## వివేకా హత్యకేసును తప్పుదారి పట్టించే యత్నం

'అబద్ధాల పునాదుల మీద పుట్టిన పార్టీ వైసీపీ.. బాబాయ్‌ను చంపింది ఎవరో తెలిసినా సాక్ష్యాలు చెరిపేయడమే మీ పనా?' అని ప్రశ్నించారు.ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుండెపోటు థియరీ నుంచి గొడ్డలి వేటు వరకు గంటకో మాట మార్చిన 'జగన్నాటకం' గూగుల్ టేకవుట్‌లో బట్టబయలైందని మంత్రి వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ వద్దని, నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడటానికి బాంబులతో బెదిరిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న వివేకా కన్నకూతురు సునీతమ్మపై అక్రమ సంబంధాల ముద్ర వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ కావాలన్నారు.. అధికారంలోకి వచ్చాక సీబీఐని తరిమికొట్టారు, ఇదేనా మీ నీతి' అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. త్య జరిగిన చోట రక్తపు మరకలను చెరిపేసి ఇంకో రకంగా చిత్రీకరించిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. 'హత్య కేసును ఆస్తి, అక్రమ సంబంధాల వైపు తిప్పడం.. అసలు నిందితులను కాపాడేందుకేనా ఈ డ్రామా?' అని ప్రశ్నించారు. 15 రోజులకోసారి పక్క రాష్ట్రాల నుంచి వచ్చి 3 గంటలు అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మే రోజులు పోయాయని అన్నారు. ప్రజల మీద, కుటుంబ సభ్యుల మీద ప్రేమ లేదని.. కేవలం దోచుకున్న వారిని కాపాడటమే వైసీపీ ఏకైక అజెండా అని ఆరోపించారు. ఒక ఆడబిడ్డ న్యాయం కోసం ఏడుస్తుంటే ఆమెపైనే నిందలు వేయడం రాజకీయ సంస్కృతా అని నిలదీశారు. 'అరాచకాలు, హత్యలు చేశారు కాబట్టే ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు.. అది గుర్తుపెట్టుకోండి' అంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. అందుకే మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిజాలు దాచేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని మంత్రి అనగాని ఆరోపించారు. చెల్లెలు సునీత బాధపై స్పందించకుండా నిందితుడితో ప్రెస్‌మీట్ పెట్టిస్తారా?అని ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపిన వారిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు.ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాస్తవాలను జగన్ ఏమార్చారు. అధికారం పోయాక బలప్రదర్శన చేస్తున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదు. జగన్ చెప్పే అబద్ధాలు నమ్మకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు' అని అనగాని అన్నారు. ఈ సందర్భంగా వివేకా హత్యపై జగన్, అవినాష్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించారు.

## సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌తో మత్స్యకారులకు మేలు

**కలెక్టరేట్ సమావేంలో మంత్రి కొల్లు రవీంద్ర**

నెల్లూరు : జువ్వలదిన్నెలో ఏర్పడుతున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్ మత్స్యకారులకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ.2500 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. మత్స్యకారులు కేవలం వృత్తిపరంగా మాత్రమే కాకుండా పారిశ్రామికవేత్తలుగానూ ఎదగాలని సూచించారు. ఇందుకోసం 125 ఎకరాల భూమిని అందుబాటులో ఉంచి పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిపై కలెక్టరేట్‌లో మత్స్యకార నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై మత్స్యకారులలో ఉన్న అనుమానాలను సమావేశంలో నివృత్తి చేసినట్లు మంత్రి తెలిపారు. మంచి ప్రాసెసింగ్ చేసిన చేపల ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, దీని ద్వారా మత్స్యకారులకు అధిక లాభాలు చేకూరుతాయని చెప్పారు. సాగర్ డిఫెన్స్ కంపెనీ కొంత భూమినే కోరిందని, మిగిలిన ప్రాంతం మత్స్యకారుల ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో వైసీపీ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి విమర్శించారు. పరిశ్రమలు రావడం వల్ల యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, గత పాలనలో పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో పరిశ్రమలు తిరిగి వస్తున్నాయన్నారు.

## డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపి

**పార్లమెంట్ చరిత్రలోనే ఇదే తొలిసారి**

**అయినా ఎంపి పుట్టా మహేశ్‌పై చర్యలేవీ**

**ఇదే చంద్రబాబు తరహా రాజకీయాలు**

**మండిపడ్డ వైసిపి అధినేత జగన్**

అమరావతి,మార్చి17 : పార్లమెంట్ చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ పుట్టా మహేషే అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. ఈ వ్యవహారం పుట్టా మహేష్‌తో మొదలై, పుట్టా మహేష్‌తో ఆగిపోలేదన్నారు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం అని మండిపడ్డారు. తప్పు చేసిన వారిపట్ల చంద్రబాబు చర్యలు తీసుకోలేదని, అందుకే రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందాలు జరుగుతున్నాయని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం అత్యాచారాలు, మోసాలపై కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. కోనేటి ఆదిమూలం మహిళపై లైంగిక దాడిచేస్తే చర్యలు లేవని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డాడు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం. ఒక పాలకుడిగా ఆయన వ్యవహరించలేదు. తప్పు చేసిన వారిపట్ల తయన చర్యలు తీసుకోలేదు. అందుకనే విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అత్యాచారాం చేశారని, ఆపై మోసం చేశారని బాధితురాలు స్వయంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. దానిపై కమిటీలు అంట. కోనేటి ఆదిమూలం మహిళ మీద దారుణమైన లైంగిక దాడిచేస్తే పంచాయితీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. మహిళలతో అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీదా నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీదా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా.. నో యాక్షన్' అంటూ వైఎస్ జగన్ ÷ర్ అయ్యారు. 'ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే నో యాక్షన్. ఇలాంటి వాటికి వత్తాసు పలికే భావన సీఎం చంద్రబాబుకు ఉంది కాబట్టే.. ఇలాంటివి జరుగుతున్నాయి. తన కొడుకు స్విమ్మింగ్ పూల్స్ వద్ద తాగుతూ, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చూస్తే నో యాక్షన్. తన బావమరిది అమ్మాయిలకు ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలని అని బహిరంగంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని చంద్రబాబు అన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. లాగి చెంపకేసి ఒక్కటి పీకాల్సింది పోయి... చేసిందేమిటన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బైక్‌ను ఢీకొన్న బస్సు...విద్యార్థి మృతి

గద్వాల,మార్చి17 : జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఒక విద్యార్థి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాము (17)గా గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. బాధితులను హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నష్టాల నుంచి గట్టెక్కిన దలాల్ స్ట్రీట్

**దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ అదరగొట్టాయి. బెంచ్‌మార్క్, సెక్టోరల్ సూచీలు మంగళవారం రాణించాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలే అందినప్పటికీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టారు. విలువైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటమే ఇందుకు కారణం. మెటల్, ఆటో, రియల్టీ రంగాల్లో మూమెంటమ్ కనిపించింది. మొత్తంగా నిఫ్టీ 172 పాయింట్లు ఎగిసింది. దీంతో ఇన్వెస్టర్లు రూ.3 లక్షల కోట్ల మేర సంపద పోగేశారు.**

క్రితం సెషన్లో 75,502 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ మంగళవారం 75,502 వద్ద మొదలైంది. 75,324 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 76,304 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 567 పాయింట్ల లాభంతో 76,070 వద్ద ముగిసింది. 23,493 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 23,346 వద్ద కనిష్ఠ, 23,656 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 172 పాయింట్లు ఎగసి 23,581 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 462 పాయింట్లు పెరిగి 54,876 వద్ద స్థిరపడింది.ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు ఎక్కువ అనుకూలంగా మారింది. మొత్తం 3327 స్టాక్స్ ట్రేడ్ అవ్వగా 1934 లాభపడ్డాయి. 1299 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 16 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 342 తాకాయి. అప్పర్ సర్క్యూటును 80 లోయర్ సర్క్యూటును 78 చేరాయి.నిఫ్టీ50లో 36 కంపెనీలు లాభపడగా 14 నష్టపోయాయి. ఎటర్నల్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బీఈఎల్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. విప్రో, సిప్లా, ఇన్ఫీ, టాటా కన్జూమర్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. నేడు ఐటీ, ఎఫ్ఎంసీజీ మినహా న్ని రంగాల సూచీలు అదరగొట్టాయి. మెటల్, ఆటో, రియాల్టి, కమోడిటీస్, మీడియా, కన్జంప్షన్, ఇన్ఫ్రా, ప్రైవేటు బ్యాంకు, ఎనర్జీ సూచీలు కళకళలాడాయి.డాలరుతో పోలిస్తే రూపాయి కొంత బలపడి 92.38 వద్ద స్థిరపడింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఫిబ్రవరి 25 తర్వాత తాజాగా 1011 కోట్ల రూపాయల విలువైన ఆర్డర్లను దక్కించుకుంది. ఆస్ట్రాజెనెకా ఫార్మా సంస్థ దుర్వాలుమాబ్ ఔషధ విక్రయానికి సిడిఎస్‌సిఓ నుండి అనుమతి పొందింది. విశాల్ మెగా మార్ట్‌కు చెందిన 10.81 మిలియన్ల షేర్లు బ్లాక్ డీల్స్ రూపంలో ట్రేడ్ అవ్వగా, ఆ కంపెనీ స్టాక్ 2 శాతం పైగా క్షీణించింది. ఫినోలెక్స్ కేబుల్స్‌పై జెఫరీస్ సంస్థ బై రేటింగ్‌ను కొనసాగిస్తూ 1,025 రూపాయల టార్గెట్ ధరను నిర్ణయించింది. ఆసియన్ పెయింట్స్‌పై మెక్వారీ సంస్థ అవుట్‌పెర్ఫార్మ్ రేటింగ్‌ను, కన్సాయ్ నెరోలాక్‌పై న్యూట్రల్ రేటింగ్‌ను ఇచ్చింది. పిఎఫ్‌సి సంస్థ ఒక్కో షేరుకు 3.25 రూపాయల మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. కెపిఐ గ్రీన్ ఎనర్జీ సంస్థ కెనరా బ్యాంక్ నుండి 979 కోట్ల రూపాయల నిధులను సమీకరించింది. గోల్డ్‌మన్ సాక్స్ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్‌కు బై రేటింగ్‌ను, శ్రీ సిమెంట్, దాల్మియా, అంబుజా మరియు జెఎస్‌డబ్ల్యూలకు న్యూట్రల్ రేటింగ్‌ను, ఏసీసీకి సెల్ రేటింగ్‌ను కేటాయించింది. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీపై 121 రూపాయల లక్ష్య ధరతో బై రేటింగ్‌ను ప్రారంభించింది. అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం కారణంగా 800 భారతీయ చిన్న కంపెనీలకు చెందిన సుమారు 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ప్రమాదంలో పడ్డాయి. హెచ్ఎస్‌బిసి సంస్థ టాటా మోటార్స్ పివిపై హోల్డ్ రేటింగ్‌ను కొనసాగిస్తూ టార్గెట్ ధరను 400 నుండి 340 రూపాయలకు తగ్గించింది. జిఎస్‌పి క్రాప్ సైన్స్ ఐపిఓ రెండో రోజు మధ్యాహ్నం సమయానికి 0.65 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. పూర్వాంకర అనుబంధ సంస్థ 280 కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టును దక్కించుకుంది.

## 172 పాయింట్లు పెరిగిన నిఫ్టీ.. బిఇఎల్ కు 1,011 కోట్ల భారీ ఆర్డర్!



### 1. ఎన్‌టీపీసీ

NTPC కేవలం ఒక పవర్ జనరేషన్ కంపెనీగానే కాకుండా, ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రంగంలో అగ్రగామిగా దూసుకుపోతోంది. ప్రస్తుతం 380 స్థాయిని దాటి ట్రేడవుతుండటం వల్ల ఇది స్పష్టమైన బుల్లిష్ ట్రెండ్‌లోకి ప్రవేశించింది. దీని అనుబంధ సంస్థ (Green Energy Subsidiary) ఐపీఓ (IPO) వార్తలు మరియు సంస్థాగత పెట్టుబడిదారుల ఆసక్తి ఈ స్టాక్‌కు బలాన్నిస్తున్నాయి. టెక్నికల్ చార్ట్స్‌లో ఇది 'ఫ్లాగ్ పాటర్న్' నుండి బ్రేక్-అవుట్ ఇచ్చింది. దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు 365--370 మధ్య ఏదైనా పతనం వస్తే దానిని కొనుగోలు అవకాశంగా మలుచుకోవచ్చు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఇది ఒక మస్ట్-హావ్ స్టాక్.

### 2. టాటా పవర్

టాటా పవర్ చార్ట్స్‌లో ప్రస్తుతం 390 స్థాయి ఒక బలమైన పునాదిగా (Floor) మారింది. ఈవీ (EV) ఛార్జింగ్ నెట్‌వర్క్ మరియు రూఫ్‌టాప్ సోలార్ రంగాలలో కంపెనీకి ఉన్న ఆధిపత్యం వల్ల ట్రెండ్ బుల్లిష్‌గా ఉంది. మూడు నెలల కన్సాలిడేషన్ తర్వాత ఇప్పుడు కొత్త వేగాన్ని పుంజుకుంది. ఆర్ఎస్ఐ (RSI) ఇండికేటర్ 65 పైన ఉండటం వల్ల ఈ అప్‌ట్రెండ్ మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ధర 375-385 శ్రేణిలోకి వస్తే అది దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు మంచి అవకాశం. 2026-2030 మధ్య జరిగే ఎనర్జీ ట్రాన్సిషన్‌లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

### 3. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్

పీఎఫ్‌సీ స్టాక్ తన నిశ్శబ్దాన్ని వీడి 400 స్థాయి వద్ద ఉన్న కన్సాలిడేషన్ దశ నుండి బుల్లిష్‌గా మారింది. 400 అనేది ఒక సైకలాజికల్ మరియు టెక్నికల్ రెసిస్టెన్స్, ఇప్పుడు అది సపోర్ట్‌గా మారింది. దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు అందించే ప్రధాన సంస్థ కావడం వల్ల దీని లోన్ బుక్ వేగంగా పెరుగుతోంది. స్వల్పకాలిక ట్రేడర్ల కోసం, దీని తదుపరి లక్ష్యం 450-465 వరకు కనిపిస్తోంది. తక్కువ వాల్యుయేషన్‌లో లభిస్తున్న ఈ గ్రోత్ స్టాక్, మంచి టార్గెట్ కోసం వేచి చూడదగినది.

### 4. ముత్తూట్ ఫైనాన్స్

ముత్తూట్ ఫైనాన్స్ 3400 స్థాయిని అధిగమించిన తర్వాత ట్రెండ్ చాలా వేగంగా (Aggressive Bullish) మారింది. 2026 ప్రారంభంలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరడం మరియు ఎంఎస్ఎంఈ (మీవీజు) రంగం నుండి గోల్డ్ లోన్స్ కోసం డిమాండ్ పెరగడం దీనికి ప్రధాన కారణాలు. స్టాక్ ప్రస్తుతం 'బ్లూ-స్కై జోన్'లో ఉంది, అంటే పైన ప్రతిరోధకాలు ఏమీ లేవు. ఒకవేళ ధర 3250 కి తగ్గితే అది కొనుగోలుకు అద్భుతమైన అవకాశం. స్వల్ప నుండి మధ్యకాలికంలో ఈ స్టాక్ 3800 స్థాయిని తాకే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

### 5. జిందాల్ స్టీల్ & పవర్.

భారీ పతనం (Great Fall) తర్వాత జిందాల్ స్టీల్ ప్రస్తుతం 1150 వద్ద రికవరీ సంకేతాలను ఇస్తోంది. చార్ట్స్‌లో ఇది 'ఇన్వర్స్ హెడ్ అండ్ షోల్డర్స్' పాటర్న్‌ను ఏర్పరుస్తోంది, ఇది సాధారణంగా ట్రెండ్ రివర్సల్‌ను సూచిస్తుంది. గ్లోబల్ స్టీల్ డిమాండ్ స్థిరపడటం మరియు దేశీయంగా మౌలిక సదుపాయాల పనులు వేగవంతం కావడం దీనికి కలిసొచ్చే అంశాలు. 1100 సమీపంలో ఈ స్టాక్‌ను సేకరించడం (Accumulate) వల్ల రిస్క్ తక్కువగా ఉంటుంది. కంపెనీ సామర్థ్యం పెరగడం వల్ల దీర్ఘకాలంలో ఇది మళ్ళీ తన పాత గరిష్ఠాలను చేరుకునే అవకాశం ఉంది.



**మూర్తినాయుడు పాదం**
నిఫ్టీ మాస్టర్, స్టాక్ మార్కెట్ అనలిస్ట్
988 555 9709

# భార్య మాట... బంగారు బాట!

- సతీమణి ప్రశ్నతో కెరీర్ దశ మారింది
- జాతీయ జట్టులోకి రావాలనే పట్టుదల పెరిగింది
- భారత టి20 ప్రపంచకప్ విజేత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ మనోగతం





టి20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా అడుగు పెట్టడం... సొంతగడ్డపై విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి స్టార్ ప్లేయర్లు లేకుండా వరల్డ్‌కప్ ఆడటం... మెగా టోర్నమెంట్‌కు ముందు అనూహ్యంగా ఇషాన్ కిషన్‌పై భరోసా పెట్టడం... కీలక మ్యాచ్‌ల్లో సంజూ సామ్సన్‌కు అండగా నిలవడం నుంచి మొదలుకొని... భార్య సలహాలతో ఆలోచన విధానాన్నే మార్చుకొని టీమిండియాకు ప్రాతినిధ్యం వహించే వరకు... టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కెరీర్‌లోని పలు కీలక దశలపై 'పీటీఐ' ఇంటర్వ్యూలో తన మనసులోని భావాలను పంచుకున్నాడు. ఐపీఎల్‌తోనే సరిపెట్టుకోవాలనుకున్న తాను... భార్య సూచనలతో భారత జట్టు కెప్టెన్‌గా ఎదగడం... తరగతి గదిలో సాధించలేనిది మైదానంలో చేసి చూపడం ఇలా సూర్యకుమార్ పంచుకున్న విశేషాలు అతడి మాటల్లోనే... న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఆడుతున్న సమయంలో దివిశతో నా వివాహం జరిగింది. జీవితం సాఫీగా సాగిపోతున్నట్లే అనిపించింది. రెండేళ్ల తర్వాత 2018లో ముంబై ఇండియన్స్‌తో జతకట్టా. అదే సమయంలో నా భార్య ఒక ప్రశ్న వేసింది. 'ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో నీతో కలిసి ఆడిన వాళ్లు చాలా మంది ఇప్పుడు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నీ మనసులో ఏం ఉంది' అని సీరియస్‌గా అడిగింది. ఆ సమయంలో నాకు కూడా టీమిండియా తరఫున ఆడాలని ఉంది అని చెప్పా. అయితే అందుకు నీ ప్రయత్నాలు ఏవి అని నేరుగా ప్రశ్నించింది.

ఇలా ఇద్దరి మధ్య ఒక చిన్న సంభాషణ నా ఆలోచన ధోరణి ని మార్చింది. అప్పటి నుంచి దేశానికి ప్రాతినిధ్యం వహించే విషయంపై మరింత దృష్టి సారించా. ఆలోచనల నుంచి ఆహారం వరకు మొత్తం మార్చేశా. సినిమాలు, షికార్లు అన్నీ పక్కన పెట్టి తీవ్రంగా శ్రమించా. ఆ ఫలితం త్వరలోనే కనిపించింది. 2018లో ఐపీఎల్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చా... అలాగే దేశవాళీల్లోనూ భారీగా పరుగులు చేశా. అలా వరుసగా మూడేళ్ల పాటు ముంబై ఇండియన్స్ తరఫున ఎన్నో మంచి ఇన్నింగ్స్‌లు ఆడా. 2020లో ఫినిషర్‌గా బాగా రాణించా... దీంతో మరుసటి ఏడాది టీమిండియా తరఫున పిలుపు వచ్చింది. ఆ క్షణాలను నేను ఎప్పటికీ మరవలేను. భార్య అడిగిన చిన్న ప్రశ్న నాలో చాలా మార్పులు తీసుకొచ్చింది. అలా అని తను నా కెరీర్‌లో జోక్యం చేసుకోదు. ఎలా ఆడాలి అనే విషయాల గురించి అసలు మాట్లాడదు. కానీ నా ఆలోచన విధానాల్లో ఉన్న లోటుపాట్లను ఎత్తిచూపుతుంది. అందుకే నా విజయాల్లో అగ్రభాగం ఆమెకే దక్కుతుంది. అలా అని ఇంట్లో ఎప్పుడూ క్రికెట్ చర్చే జరుగుతుంది అనుకుంటే పొరబాటే. ఆటను గేటు బయటే పెట్టి ఇంట్లోకి రమ్మని అంటుంది. ఇంట్లో ఉన్నప్పుడు నువ్వు సూర్యకుమార్ యాదవ్ కాదు... కేవలం సూర్య మాత్రమే అంటూ చమత్కరిస్తుంది. 2024లో టి20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో... తాజాగా ట్రోఫీ చేజిక్కించుకున్న జట్టులో చిన్న చిన్న తేడాలు మాత్రమే ఉన్నాయి. 2024 టీమ్‌లో అనుభవంతో కూడిన జోరు ఉండేది..



## రెండో టి20లో న్యూజిలాండ్ గెలుపు

### దక్షిణాఫ్రికాతో సిరీస్

హామిల్టన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు టి20 సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 175పరుగులు చేయగా.. అనంతరం దక్షిణాఫ్రికాను 15.3ఓవర్లలో 107పరుగులకే ఆలౌట్ చేసింది. తొలుత న్యూజిలాండ్ బ్యాటర్ డెవాన్ కాన్వే(60) అర్ధసెంచరీకి తోడు కెల్లీ(21), కెప్టెన్ సాంట్నర్(20)కి తోడు చివర్లో జోష్ క్లార్క్‌సన్(26; 9బంతుల్లో 2ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసారు. దక్షిణా ఫ్రికా బౌలర్లు ముల్డర్‌కు రెండు, లిండే, కెప్టెన్ కేశవ్ మహరాజ్, బార్ట్‌మన్, కోర్జ్టెల కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం కివీస్ బౌలర్లు సమిష్టిగా చెలరేగారు. ఫెర్గు సన్, సీర్స్‌కు మూడేసి, సాంట్నర్‌కు రెండు దక్కాయి. దక్షిణాఫ్రికా జట్టులో లిండే (33) టాప్ స్కోరర్. ఓపెనర్ ముల్డర్(16)కి తోడు హెర్మన్(19), స్మిత్(12), ఫోరె స్టర్ (12) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డెవాన్ కా న్వేకు దక్కింది. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్నాయి.

#### దక్షిణాఫ్రికా అమ్మాయిల గెలుపు...

న్యూజిలాండ్ పర్యటనలో దక్షిణాఫ్రికా మహిళల జట్టు శుభారంభం చేసింది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ లో భాగంగా మంగళవారం హామిల్టన్ వేదికగా జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 18 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. తొలుత దక్షిణాఫ్రికా మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్(43), లారా వోల్వార్ట్(41)కి తోడు చివర్లో రెనెకె (28నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో అమెలియా కెర్, జెస్ కెర్‌లు చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ మహిళల జట్టు 19.1 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. అమెలియా కెర్ (32), ఇజీ షార్ప్ (29) పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఖాకా 4 వికెట్లకి తోడు లాబా 3 వికెట్లు పడగొట్టారు. కరులా రెనెకెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్



### ప్రపంచకప్ హాకీ 'డ్రా' విడుదల

#### ఆగస్టులో మెగా టోర్నీకి నెదర్లాండ్స్-బెల్జియం ఆతిథ్యం

లుసానే (స్విట్జర్లాండ్): హాకీ వరల్డ్ కప్‌లో పాల్గొనే జట్ల గ్రూప్‌ల వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వెల్లడించింది. రెండు ఒలింపిక్ స్వర్ణాలు, రెండు ప్రపంచకప్ విజయాల్లో భాగంగా ఉన్న డచ్ హాకీ క్రీడాకారిణి నవోమీ వాన్ ఆజ్ సహా పలువురు మాజీ ఆటగాళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో, మహిళల విభాగంలో ఒకేసారి ప్రపంచకప్‌లను నిర్వహిస్తుండటం విశేషం. బెల్జియం, నెదర్లాండ్స్‌లలో ఆగస్టు 14 నుంచి 30 వరకు పోటీలు జరుగుతాయి. రెండు మెగా టోర?నలకు సంబంధించిన వేర్వేరు మస్కట్‌లను కూడా ఎఫ్ఐహెచ్ విడుదల చేసింది. వరల్డ్ కప్‌లో మొత్తం 16 జట్ల చొప్పున పాల్గొంటున్నాయి. ఒక్కో పూల్ నుంచి టాప్--2 జట్లు ముందంజ వేస్తాయి. ఎనిమిది టీమ్‌లతో రెండో దశ నిర్వహిస్తారు. ఆ తర్వాత నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి. పురుషుల విభాగంలో పూల్ 'డి'లో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ పూల్‌లో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఇంగ్లండ్, వేల్స్ జట్లు ఉన్నాయి. మహిళల విభాగంలో భారత్ పూల్ 'డి'లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, చైనాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. టోర్నమెంట్ మ్యాచ్‌ల పూర్తిస్థాయి షెడ్యూల్‌ను నేడు ప్రకటిస్తారు. 2022లో జరిగిన వరల్డ్ కప్‌లో జర్మనీ, నెదర్లాండ్స్ పురుషుల, మహిళల విభాగాల్లో విజేతలుగా నిలిచాయి. పూల్ 'ఎ': నెదర్లాండ్స్, అర్జెంటీనా, న్యూజిలాండ్, జపాన్; పూల్ 'బి': బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, మలేసియా; పూల్ 'సి': ఆస్ట్రేలియా, స్పెయిన్, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా; పూల్ 'డి': భారత్, పాకిస్తాన్, ఇంగ్లండ్, వేల్స్.






# రాకాస రైట్స్ వాళ్లకే..

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల నిర్మిస్తున్న తాజాచిత్రం 'రాకాస'. జీ స్టూడియోస్ ఉమేశ్ కుమార్ బన్సాల్ సమర్పణలో రూపుదిద్దుకుంటోంది సినిమా. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న సంగీత్ శోభన్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఇందులో ఆయనకు జోడీగా నయన్ సారిక కనిపించనుంది. మానస శర్మ కథను అందించటంతోపాటు దర్శకత్వం వహించారు. ప్రేమ, హాస్యం, ఫాంటసీ అంశాలు కలగలిపిన కథతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను ముఖ్యపాత్రలు పోషించారు. భారీ అంచనాల నడుమ ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో రిలీజ్ అవుతోంది. ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాపై మొదట్నుంచీ బజ్ ఏర్పడింది. రిలీజ్‌కు ముందే తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు సంబంధించి థియేట్రికల్ బిజినెస్ డీల్ తాజాగా జరగ టంతో ఆ అంచనాలు రెట్టింపయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ సినిమా థియేట్రిల్ రైట్స్‌ను శ్రీలక్ష్మి నరసింహ మూవీ మేకర్స్ సొంతం చేసుకున్నారు. తెలంగాణ జిల్లా కవరేజ్ దీంతో మేకర్స్ ఓవర్సీస్‌లోనూ భారీ స్థాయిలో రిలీజ్‌కు సన్నాహాలు చేస్తు న్నారు. అథర్వణ భద్రకాళి పిక్చర్స్ ఈ సినిమా అంతర్జాతీయ డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలను నిర్వహిస్తోంది. ఈ సంస్థ అమెరికా, యునైటెడ్ కింగ్డమ్, యూరప్, కెనడా, ఆస్ట్రేలియా వంటి కీలక ప్రాంతాల్లో కలిపి 350కు పైగా అంతర్జాతీయ స్క్రీన్లలో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేసింది. ముఖ్యంగా నార్త్ అమెరికా, యునైటెడ్ కింగ్డమ్ మార్కెట్లలో డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలను ప్రత్యంగిరా సినిమాస్ చేపట్టింది. విదేశీ ప్రేక్షకుల కోసం ప్రీమియర్ షోలు 2026 ఏప్రిల్ 2న ప్రదర్శించనున్నారు. ఆ తర్వాతి రోజే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# యాక్షన్ షురూ

సినిమా పట్టాలెక్కడమే ఆలస్యం... మెరుపు వేగంతో చిత్రీకరణను ముందుకు నడిపిస్తుంటారు అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. ఇటీవలే మొదలైన ఆయన కొత్త చిత్రం పరుగులు పెడుతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఆ చిత్రం తెరకెక్కుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో బాలకృష్ణతోపాటు, ఇతర తారాగణం పాల్గొంటు న్నారు. విజయవంతమైన 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా నయనతార నటించనున్నట్టు తెలిసింది. కీలకమైన ఓ పాత్ర కోసం మంచు మనోజ్‌నీ సంప్రదించినట్టు తెలుస్తోంది. ఇది బాలకృష్ణ 111వ చిత్రం. మొదట ఓ చారిత్రక కథతో తెరకెక్కించా లనుకున్నా, ఆ తర్వాత నిర్ణయాన్ని మార్చుకుని ఓ యాక్షన్ ప్రధానమైన కథతో సినిమాని పట్టాలెక్కించారు.





# అలాంటి పాత్రలు ఇక చేయను!

కెరీర్‌లో కొన్నిసార్లు హిట్ కొట్టాలనే ఆత్రుతతో పాత్రలను అంగీకరించి తప్పు చేశానంటోంది బాలీవుడ్ హీరోయిన్ భూమి పెడ్నేకర్. తాజాగా 'వి ది విమెన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తనని అగౌరవపరిచే పాత్రలు చేయనని వెల్లడించింది. ఇటీవల వచ్చిన 'దల్దాల్' సిరీస్‌లో శక్తిమంతమైన పోలీసు అధికారిగా కనిపించిన భూమి.. గతంలోని పాత్రల ఎంపికలో తప్పు చేసినట్టు ఎప్పుడైనా అనిపించిందా? అని అడిగినప్పుడు తన ఆలోచనల్ని పంచుకుంది. "నేను తప్పులు చేశాను. వాటిలో అతి పెద్దది ఏంటంటే.. కెరీర్‌లో కొన్ని పాత్రలు అంగీకరించాను. కాని వాటిని ఆస్వాదించలేకపోయాను. కెరీర్‌లో ఈ స్థాయికి చేరుకోవడానికి చాలా కష్టపడ్డాను. ఇకపై నాకు అగౌరవాన్ని కలిగించే పాత్రల్ని చేయను"అని అంది.



# అద్దీ హ్యాపీరాజ్ లెక్క

జి.వి.ప్రకాశ్‌కుమార్, శ్రీగౌరీప్రియ జంటగా తెరకెక్కిన చిత్రం 'హ్యాపీరాజ్'. మరియారాజా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. జైవర్ధ నిర్మాత. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ నుంచి ఈ నెల 27న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులోని 'అద్దిరా లెక్క...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. జస్టిన్ ప్రభాకరన్ స్వరకల్పనలోని ఈ పాటని రెహ్మాన్ రచించగా, గోవింద్ ప్రసాద్ ఆలపించారు. "విభిన్నమైన కథతో రూపొందిన చిత్రమిది. అద్దిరా లెక్క... పాటకు జీవీ ప్రకాశ్ డాన్స్, ఆయన కనిపించే విధానం ప్రత్యేకం. విడుదలైన వెంటనే పాటకి మంచి స్పందన లభించింద"ని సినీ వర్గాలు చెప్పాయి.

# హారర్ చిత్రంలో.. ఆదిత్య?



గతేడాది సారా అలీఖాన్‌కు జంటగా రొమాంటిక్ సినిమా 'మెట్రో ఇన్ దినో'లో కనిపించి ప్రేక్షకుల్ని అలరించాడు హిందీ హీరో ఆదిత్యరాయ్ కపూర్. ఇప్పుడాయన ప్రయోగా త్మకంగా తదుపరి హారర్ సినిమా కోసం కరణ్ జోహా ర్‌తో కలిసి పనిచేయనున్నారని సమాచారం. "కరణ్ జోహార్ తన బ్యానర్ ధర్మ ప్రొడక్షన్స్‌లో ఓ హారర్ థ్రిల్లర్ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇందులో కథానాయకుడిగా ఆదిత్య కపూర్‌ని ఎంపిక చేశారు. ఆదిత్యకి కూడా స్క్రిప్ట్ నచ్చి సినిమా చేయడానికి రంగంలోకి దిగారు. ఈ సినిమాకి 'కాల్ మీ బే' చిత్ర దర్శకుడు కొల్లిన్ డి కున్హా దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే ప్రొడక్షన్ పనుల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మేలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంద"ని బాలీవుడ్ వర్గాలు చెప్పినట్టు సమాచారం.

# ఇంటిమేట్ సీన్స్‌లో దిశాపటానీ



బాలీవుడ్ సీరియల్ కిస్సర్ ఇమ్రాన్ హష్మీతో సినిమా అంటే ఘాడమైన లిప్ లాక్‌లు తప్పనిసరి. హీరో–హీరోయిన్ పెదవులు జుర్రుకోవడం సినిమా కే హైలైట్ గా నిలుస్తుంది. ఆ విషయంలో సీరియల్ కిస్సర్‌ని కొట్టే మొనగాడే లేడు. ఇమ్రాన్ హష్మీ సుదీర్ఘ కెరీర్లో అనేక మంది హీరోయిన్లతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించారు. తాజాగా ఓ సినిమా కోసం మళ్లీ తనలోని సీరియల్ కిస్సర్ ని తట్టి లేపుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలొస్తున్నాయి. ప్రస్తుతం ఇమ్రాన్ హష్మీ హీరోగా అవారపన్ కు సీక్వెల్ అవారపన్ 2 ని నితిన్ కక్కర్ తెరకెక్కిస్తు న్నాడు. ఇందులో హీరోయిన్ గా దిశా పటానీ నటిస్తోంది. అయితే ఈసినిమాలో కొన్ని ఇంటిమేట్ సన్నివేశాలు కూడా ఉన్నాయని వార్తలొస్తున్నాయి. హీరో–హీరోయిన్ మధ్య సన్నిహిత సన్నివేశాలను చిత్రీకరించారని తెలిసింది. అయితే వాటిలో లిప్ లాక్ సన్నివేశాలు ఉన్నాయా? లేదా? అన్నది క్లారిటీ లేదు. ఆరేళ్లగా ఇమ్రాన్ హష్మీ నో కిస్ పాలసీ పాటిస్తున్నాడు కాబట్టి? లిప్ లాక్ లేకుండా ఇంటిమేట్ సన్నివేశాలు డిజైన్ చేసారా? లేక పాలసీని పక్కన బెట్టాడా? అన్నది క్లారిటీ లేదు. ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకొస్తున్న తరుణంలో ఈ విషయం లీక్ అవ్వడం సినిమాకు మంచి బజ్ ను తీసుకొస్తుంది. గ్లామర్ డాల్ దిశాపటానీ సైతం గ్లామర్ పాత్రలకు.. ఇంటిమేట్ సన్నివేశాలకు నో చెప్పే నటి కాదు. ఆ విషయంలో పూర్తిగా దర్శకుల హీరోయిన్ గా పనిచేస్తుంది.



# కొమ్మల్లో కోయిల కూయంగ.. తెల్లవారే మా పల్లె పచ్చంగ!

హీరో కిరణ్ అబ్బవరం నిర్మాణంలో సాయి తేజ్, వేద జలంధర్ నాయకానాయికలుగా పరిచయమవుతున్న చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. వి.మునిరాజు తెరకెక్కించారు. ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "కొమ్మా కొమ్మల్లో కోయిల కూయంగ.. తెల్లవారే మా పల్లె పచ్చా పచ్చంగ.. ఎచ్చని ఎలుగు సీరే కట్టె సక్కంగ" అంటూ తిమ్మరాజు పల్లె అందాల్ని.. అక్కడ జరిగే శివరాత్రి సందడిని ఆవిష్కరిస్తూ సాగిందీ పాట. దీనికి వంశీకాంత్ రేఖన స్వరాలు సమకూర్చగా.. సనరే సాహిత్యమందించారు. మమత రమేశ్ ఆలపించారు. "ఇది పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామా సినిమా. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం" అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకి కూర్పు: మునిరాజు, ఛాయాగ్రహణం: అక్షయ్ రామ్ పొదిశెట్టి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787